

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 23.07.2026 | సంపుటి: 3 | సంచిక: 171 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | THURSDAY | 23.07.2026 | VOLUME : 3 | ISSUE : 171 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




# కాక్రోచ్ లను కమ్మేసిన కాంగ్రెస్


- బీజేపీ గేమ్ లో పావుగా మారిన రాహుల్
- ప్రధాని నివాసంలో ధర్నాతో కాంగ్రెస్ ఇమేజ్ డ్యామేజ్
- కమలానికి పొలిటికల్ మైలేజ్
- అధికార, ప్రతిపక్షాల మధ్య పరస్పర విమర్శలు
- మీడియా దృష్టి నిరసనపై కేంద్రీకరణ
- ఆందోళన అనంతరం వ్యూహాలపై భిన్నాభిప్రాయాలు
- జాతీయ రాజకీయాలలో చర్చ

**న్యూఢిల్లీ, జూలై 22(రాజముద్ర న్యూస్):**

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వెలుపల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ధర్నా, ఆందోళన సందర్భంగా ఆయన గాయపడటం జాతీయ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా మీడియా దృష్టిని ఆకర్షించడమే కాకుండా, అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదానికి కారణమైంది. అయితే,పైకి కనిపించే ఈ రాజకీయ నిరసన వెనుక అత్యంత సంక్లిష్టమైన వ్యూహాత్మక రాజకీయ కోణం ఉందనే చర్చ ఇప్పుడు రాజకీయ పరిశీలకుల్లో జోరుగా

మిగతా 2వ పేజీలో..

# కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ఆందోళనలు



- లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం
- గాంధీభవన్ ముట్టడికి బిజెపి నేతల దూకుడు
- ఇరువర్గాల పరస్పరం దాడులతో ఉద్రిక్తత
- రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు
- నగరంలో పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతల అరెస్ట్

**హైదరాబాద్, జూలై 22(రాజముద్ర న్యూస్):**

కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట

మిగతా 2వ పేజీలో..




# నిరసన తెలిపితే పాశవిక దాడులా?

- రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్రం
- నిందితులను శిక్షించకుండా విద్యార్థులపై దాడులా?
- కేటీఆర్ బినామీ సంస్థపై బీజేపీకి ఎందుకంత ప్రేమ?
- నరేంద్ర, ధర్మేంద్ర దేశాన్ని దోచుకుంటున్నారు
- కొడంగల్ ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## ప్రతిపక్ష నేతల అరెస్టు రాజ్యాంగాన్ని అవమానించడమే

2

- డిప్యూటీ సీఎం భట్టి ఆధ్వర్యంలో హన్మకొండలో నిరసన

# భూసేకరణ పూర్తయ్యాకే టెండర్లు

- మున్సిపల్ అభివృద్ధి పనులపై అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు
- జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ ప్రాజెక్టులపై సమీక్ష
- శాఖల మధ్య సమన్వయంతో అనుమతులు వేగవంతం చేయాలని సూచన
- మన్మోహన్ సింగ్ విగ్రహం, నిర్మాణ నమూనాలను పరిశీలించిన సీఎం

3



## నన్ను దెబ్బ తీయడానికి కుట్రలు

- పేర్లు వేరు అయినా బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే
- కొడంగల్‌లో 1,96,620 ఓట్లు ప్రక్షాళన
- వారి ఓట్లన్నీ నమోదు చేయించాలి
- ఎస్ఐఆర్ పై బీఎల్ఏల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

3

# రాష్ట్రంలో 'పవర్ కట్ అనేదే లేదు

- 7 వేల మెగావాట్ల డిమాండ్‌ను తట్టుకున్నాం
- వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన డిమాండ్
- 2 వేల మెగావాట్ల జల విద్యుత్ నిలిచినా నిరంతర సరఫరా
- పటిష్టవంతమైన విద్యుత్ వ్యవస్థతోనే సాధ్యమైంది
- ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి సమీక్ష




**హన్మకొండ, జూలై 22 :**

ఎల్ నినోతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన విద్యుత్ డిమాండ్, పడిపోయిన జల విద్యుత్ ఉత్పత్తితో ఒకేసారి ఏడు వేల మెగావాట్ల అదనపు భారాన్ని మన విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా తట్టుకుందని ఉప ముఖ్యమంత్రి,

మిగతా 3వ పేజీలో..

# సీసీఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి?

- జిల్లా అభివృద్ధికి సిమెంట్ ఫ్యాక్టరీ అతి ముఖ్యం
- సిఎం రేవంత్‌కు బిఆర్ఎస్ నేత కెటిఆర్ లేఖ

**హైదరాబాద్, జూలై 22(రాజముద్ర న్యూస్):**

ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆదిలాబాద్ అభివృద్ధికి సీసీఐ పునరుద్ధరణ కీలకమని.. రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యమేనని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే జాప్యానికి కారణమన్న కేటీఆర్ సీసీఐ పునరుద్ధరణపై రేవంత్ ఇచ్చిన

మిగతా 3వ పేజీలో..



# సూపర్ ఎల్ నినోతో అప్రమత్తంగా ఉండాలి

- తాగునీటి పరిరక్షణకు ముందస్తు చర్యలు అవసరం
- రైతులు ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపాలి
- యూరియా పంపిణీకి పారదర్శక వ్యవస్థ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

2



# రాహుల్ ది దేశ వ్యతిరేక వైఖరి

- గాంధీ భవన్ ముట్టడికి బీజేపీ పిలుపు
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అరెస్ట్



**హైదరాబాద్, జూలై 22(రాజముద్ర న్యూస్):**

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశ వ్యతిరేక, విచ్ఛిన్నకర రాజకీయాలను

మిగతా 3వ పేజీలో..



# నీట్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన కల్వకుంట్ల కవిత.. కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపాటు
- శాంతియుత నిరసనపై బలప్రయోగం ప్రజాస్వామ్యానికి మచ్చ అన్న కవిత
- ప్రశ్నపత్రం లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని ఆరోపణ
- బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్
- సోనం వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు వెల్లడించాలని విజ్ఞప్తి

3

# హాస్పిటల్ నుంచి ట్రైనీ ఐపీఎస్ డిశ్చార్జ

- లైంగిక వేధింపుల కేసులో దర్యాప్తు కొనసాగింపు
- కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి విడుదల
- ఆరోపణలపై స్పందించేందుకు నిరాకరణ
- బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసిన షీ టీమ్
- ఎఫ్ఐఆర్ రద్దు పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా

3



# బీఆర్ఎస్ పాలనలో ప్రజల గోడు వినేవారే లేరు

- 'ముఖాముఖి'తో ప్రజల సమస్యలకు పరిష్కారం
- క్యూఆర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి
- ప్రధాని మోదీ, విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలి
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

2






# ప్రతిపక్ష నేతల అరెస్టు రాజ్యాంగాన్ని అవమానించడమే

**హన్మకొండ, జూలై 22 :**

ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద యువతపై పోలీస్ దమనకాండను వ్యతిరేకిస్తూ ప్రధాని నివాసం వద్ద నిరసన చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్లమెంటు సభ్యురాలు ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను కేంద్ర ప్రభుత్వం అ□రెస్టు చేయడాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఖండించారు. ఈమేరకు హన్మకొండ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పలువురు పార్టీ నాయకులతో కలిసి భట్టి విక్రమార్క బుధవారం నిరసన తెలిపారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలో యువతపై జరిగిన పోలీస్ దమనకాండను వ్యతిరేకిస్తూ ప్రధాని నివాసం వద్ద శాంతియుతంగా నిరసన తెలిపిన ప్రతిపక్ష నేతలను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమేనని భట్టి అన్నారు. 'నీట' ప్రశ్నా పత్రాల లీకేజీతో దేశంలోని కోట్లాదిమంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ అక్రమాలపై ప్రశ్నిస్తూ ఆందోళన చేస్తున్న అమాయక విద్యార్థులు, ఆడపిల్లల పట్ల పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించి, లాఠీఛార్జి చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. పరీక్ష పత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వ అరాచక పాలన సాగుతోందని, ప్రశ్నించిన వారిపై దాడులు, అరెస్టులు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. దేశ యువత భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ దిక్సూచిలా నిలిచి పోరాడుతున్నారన్నారు. లాఠీలతో విద్యార్థుల గొంతును, అరెస్టులతో రాహుల్ గాంధీ పోరాటాన్ని ఆపలేరని, కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షాలు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆఖరి వరకు పోరాడతాయని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి దేశంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

**విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరు కొనసాగుతుంది : మంత్రి పొంగులేటి**

విద్యార్థులకు మద్దతుగా పోరాడుతున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, అజారుద్దీన్, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కాంగ్రెస్ నాయకులు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరమ్మ విగ్రహం నుండి లోక్ భవన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తన అసమర్థతను, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి అక్రమ అరెస్టులకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని మంత్రి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా దేశ యువతకు క్షమాపణలు చెప్పాలని, 'నీట' పేపర్ లీక్‌తో 21మంది విద్యార్థుల మరణాలకు బాధ్యత వహిస్తూ విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, విద్యార్థులపై లాఠీచార్జికి కారణమైన హోంమంత్రి అమిత్ షాని మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ఆందోళనలు

**మొదటిపేజీ తరువాయి**



కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు దిగారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరో పక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లోకూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరు పార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇలా ఉండగా కాంగ్రెస్ దాడికి నిరసనగా పార్టీ జిల్లా కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్‌ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.





# నిరసన తెలిపితే పాశవిక దాడులా?

**కొడంగల్, జూలై 22(రాజముద్ర న్యూస్):**

'నీట్' పేపర్ లీక్‌పై పోరాటం చేస్తున్న విద్యార్థులకు మద్ధతుగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపితే పాశవిక దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి, పోలీసుల పాశవిక దాడులపై కొడంగల్‌లో ముఖ్యమంత్రి నాయకత్వంలో బుధవారం భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. 'నీట్' పేపర్ లీక్‌తో బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్ధకంగా మార్చిందని సీఎం విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుని ఆ పార్టీ నాయకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేసి, 'నీట్' పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సిందిపోయి జంతర్‌మంతర్ వద్ద శాంతియుత నిరసన తెలిపిన విద్యార్థులపై పాశవికంగా దాడి జరుపుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించకుండా పోయారన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్, ప్రియాంకలు ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పాశవికంగా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. పాశవిక దాడితో రాహుల్ గాంధీ రక్తం చిందిందంటూ దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని చెప్పారు. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. బాంబు దాడితో శరీరం ముక్కలైనా దేశ సమైక్యత కోసం ప్రాణాలిచ్చిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని గుర్తు చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని, కనీసం మంత్రి పదవి కూడా తీసుకోలేదని తెలిపారు. మన్మోహన్ సింగ్‌ను ప్రధానిని చేసి త్యాగనిరతిని చాటుకున్న గొప్ప వ్యక్తి సోనియా గాంధీ అని కొనియాడారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని గుర్తు చేశారు. ప్రజా స్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగంలో కల్పించిన హక్కు అన్నారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా ప్రధాని అడ్డుకున్నారని విమర్శించారు. దేశాన్ని దోచుకుంటున్న నరేంద్ర, ధర్మేంద్ర ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఇద్దరూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 2019లో ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడిందని గుర్తు చేశారు. ఆ సంస్థ 27 మంది విద్యార్థుల ప్రాణాలు బలిగొన్నదన్నారు. అనుభవం, అర్హత లేకపోయినా రాజకీయ ఒత్తిళ్లతో ఆనాడు కేటీఆర్ తన బినామీ సంస్థ గ్లోబరీనాకు ప్రాజెక్టును అప్పగించారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని ఆ సంస్థ కోయెంప్ట్ ఎడ్యుకేషన్‌గా పేరు మార్చుకుని సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని తెలిపారు. ఢిల్లీ బీజేపీ వాళ్లతో మాట్లాడుకుని వాళ్లకు కేటీఆర్ కాంట్రాక్టు ఇప్పించారని, 'నీట' నిర్వహించడంతో వాళ్లకు దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వచ్చిందని ఆరోపించారు. సీబీఎసఈలో అక్రమాలు, 'నీట్' పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారన్నారు. విద్యార్థులు, యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు.

**అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ**

రాహుల్, ప్రియాంకలతోపాటు విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొడంగల్‌లో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఉదయం తన నివాసంలో ఎసఐఆర్‌పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా బయలుదేరారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడి చిత్రాలతో కూడిన బ్యానర్‌తో ఎమ్మెల్యేలు, స్థానిక నాయకలుతో కలిసి కాలినడకన అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# సూపర్ ఎల్ నినోతో అప్రమత్తంగా ఉండాలి

**ఖమ్మం, జూలై 22(రాజముద్ర న్యూస్):**

సూపర్ ఎలినినో ప్రభావం 1977 కరవు కంటే తీవ్రంగా ఉండే అవకాశముందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉన్నందున తాగునీటిని పొదుపుగా వినియోగించాలని, రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులు ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఖమ్మం అర్బన్లోని వి.వెంకటాయపాలెం డీప్ కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి మంత్రి తుమ్మల పరిశీలించారు. అనంతరం అధికారులు, ఇంజినీర్లతో సమావేశమై తాగునీటి సంరక్షణ, గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని పొదుపుగా వినియోగించా లని మంత్రి సూచించారు. రైతులు వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని కోరారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు జిల్లాకు అందుతున్నాయని, రాజీవ్ కాలువ షట్టర్లను మూసివేసి నీటిని తిరిగి ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగం కొనసాగుతోందన్నారు. అవసరమైతే డీప్కట్ నుంచి మంచుకొండకు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పశ్చిమా సియా యుద్ధాల ప్రభావంతో యూరియా ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్న మంత్రి, రైతులకు పారదర్శకంగా ఎరువులు అందించేందుకు ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్ ను ప్రవేశపెట్టిం దన్నారు. రాజకీయ ప్రచారాలను నమ్మకుండా ప్రభుత్వ సూచనలు పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగిస్తూ జూన్2027 వరకు తాగునీటి అవసరాలు తీర్చేలా కార్యాచరణ రూపొం దించామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగితే వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు కష్టతరమవుతుందని హెచ్చరిస్తూ, అధికారులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని రైతులకు సూచించారు. అనంతరం మంత్రి ఖమ్మం నగరం లోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ.175 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్ర సాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సిఇ ఇరిగేషన్ శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డీపీఓ రాంబాబు, వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలో ప్రజల గోడు వినేవారే లేరు

**హైదరాబాద్, జూలై 22 :**



పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పాలకులకు ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి అవకాశం ఉండేదికాదని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదని అన్నారు. గాంధీ భవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో బుధవారం పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిసూచనల మేరకు ప్రతి వారం క్యాబినెట్‌లో ఒక మంత్రి ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తు వీలైనంతవరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈరోజు నిర్వహించిన ముఖాముఖిలో చాలా వరకు ఇండ్ల గురించి దరఖాస్తులు వచ్చాయన్నారు. పేదవారి ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం ఈ ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ ప్రభుత్వంలోనే తమ సొంతింటి కల నెరవేతుందనే ఆశతో ప్రజలు ఉన్నారు. వారి ఆశలకు అనుగుణంగా తమ ప్రభుత్వం మొదటి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలు మొత్తం 7 లక్షల ఇండ్లను మంజూరు చేసిందన్నారు. గడచిన పది సంవత్సరాలలో ఆనాటి ప్రభుత్వం పేదలకు అరకొరగా నగరానికి 3040 కిలోమీటర్ల దూరంలో ఇండ్లు నిర్మించిందని ఫలితంగా తమ జీవనోపాధి దెబ్బతింటుందన్న ఆందోళనతో పేదలు ఆ ఇళ్లల్లో అడుగుకూడా పెట్టలేదన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా పేదవాడు పుట్టి పెరిగిన చోటే నివాసం కల్పించాలన్న ఆలోచనతో నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు నిర్మించబోయే ఇండ్ల విలువ 40 నుంచి కోటి రూపాయిల వరకు ఉంటుందని ఇంటి స్థలంలో వాటా కూడా కల్పిస్తున్నామని తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఈ ఇండ్ల కోసం మీసేవ, వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా మరో సారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించిన వచ్చిన దరఖాస్తుల్లో పరిష్కరించగలిగిన అన్నింటికీ పరిష్కారం చూపిస్తామన్నారు. దేశంలో యువతను దెబ్బతీసిన 'నీట్లీ' కేజీపై శాంతియుతంగా ఢిల్లీలో ధర్నా చేస్తున్న యువతపైన, మద్దతు తెలిపిన కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలపై లాఠీఛార్జి చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేక పార్లమెంటును పలుమార్లు వాయిదా వేయడం, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ చేతకానితనాన్ని ఎత్తిచూపుతుందన్నారు. తక్షణమే ప్రధాని మోదీ, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# కాక్రోచ్ లను కమ్మేసిన కాంగ్రెస్

**మొదటిపేజీ తరవాయి**

సాగుతోంది.

రాహుల్‌కు ఆ అవకాశం బీజేపీనే కల్పించిందా?

రాహుల్ గాంధీకి ఈ స్థాయిలో నిరసన తెలిపేందుకు, మీడియాలో భారీ స్పేస్ ఆక్రమించేందుకు అధికార బీజేపీయే వ్యూహాత్మకంగా అవకాశం కల్పించిందనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో ఏదీ యాదృచ్ఛికంగా జరగదనే నానుడికి తగినట్లుగా, కాంగ్రెస్ అగ్రనేతను ఒక పావులా వాడుకుని పెద్ద ఎత్తున ప్రజా దృష్టిని వేరే అంశాల వైపు మళ్లించే ప్రయత్నం జరిగిందన్న భావన వ్యక్తమవుతోంది. రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఈ హైవోల్టేజ్ ఆందోళనను అధికార పక్షం తమకు అనుకూలమైన ఒక వ్యూహాత్మక ఆయుధంగా మలచుకుందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయి.

**కాక్రోచ్‌ల నుంచి డైవర్షన్ కోసమే?**

ప్రస్తుతం దేశంలో తీవ్రరూపం దాల్చుతున్న సిజెపి ఆందోళనలు, కాక్రోచ్‌ల ఉద్యమం వంటి తీవ్రమైన ప్రజా ఆగ్రహ ఉద్వేగాలను పక్కదారి పట్టించడానికి లేదా వాటి ఉధృతిని తగ్గించడానికి ఈ ధర్నా ఒక సేఫ్టీ వాల్వ్‌లా ఉపయోగపడిందనే వాదన ప్రధానంగా వినిపిస్తోంది. ప్రజా సమస్యలపై జరుగుతున్న ఈ ఉగ్ర పోరాటాల తీవ్రతను కప్పిపుచ్చేందుకు, ప్రజల మరియు మీడియా దృష్టిని పూర్తిగా రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన వైపు మళ్లించేందుకు ఇదొక చక్కటి వ్యూహంగా అమలు చేశారని భావిస్తున్నారు. తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకు ఇలాంటి నాటకీయ పరిణామాలు దోహదపడతాయని భావిస్తున్నారు. ఈ పరిణామం ద్వారా అధికార పక్షానికి ఒక రకమైన వ్యూహాత్మక ప్రయోజనం చేకూరినట్లు కనిపిస్తోంది. సున్నితమైన ఉద్యమాల నుంచి దృష్టిని వేరే వైపు మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ ధర్నా ఒక కంట్రోల్డ్ ఆపోజిషన్ వ్యూహంలో భాగమనే అనుమానాలు బలపడుతున్నాయి. రాహుల్ గాంధీకి తగినంత స్పేస్ ఇవ్వడం ద్వారా అసలు సమస్యల మూలాలను తెరవెనుకకు నెట్టి, కేవలం వ్యక్తిగత లేదా పార్టీ కేంద్రీకృత అంశాలపై చర్చ జరిగేలా చూడటంలో బీజేపీ వ్యూహం సఫలమైందనే చెప్పాలి.

**కాక్రోచ్‌లకు తగ్గిపోయిన మీడియా అటెన్షన్**

మీడియా దృష్టిని పూర్తిగా మోదీ నివాస ఆందోళన , రాహుల్ గాంధీ గాయం చుట్టూ కేంద్రీకరించడం ద్వారా, దేశవ్యాప్తంగా ఊపందుకుంటున్న ఇతర ప్రజా ఉద్యమాల వేగం ఆకస్మికంగా నెమ్మదించింది. మీడియాలో ప్రధాన హెడ్‌లైన్స్ అన్నీ రాహుల్ ధర్నా గురించే రావడంతో, కాక్రోచ్‌ల ఉద్యమం, సిజెపి ఆందోళనల తీవ్రత కొంతమేర కిందికి దిగివచ్చింది. ఇది అధికార పార్టీకి వ్యూహాత్మకంగా అతిపెద్ద ఊరటనిచ్చే అంశంగా రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ మొత్తం వ్యూహంలో కాంగ్రెస్ పార్టీ తాము ఒక పెద్ద పోరాటం చేశామని భావిస్తున్నప్పటికీ, వాస్తవానికి అది అధికార పార్టీ వ్యూహంలో భాగస్వామ్యం కావడమేనని విమర్శకులు ఎత్తిచూపుతున్నారు. బీజేపీ సర్కార్‌ను ఇరుకున పెట్టాలని భావించిన రాహుల్ గాంధీకి స్పేస్ దక్కినప్పటికీ, దానివల్ల అసలు ప్రజా సమస్యల తీవ్రత నీరుగారిపోయింది. ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల నుంచి దృష్టిని మళ్లించే డెకాయ్ రాజకీయాలకు కాంగ్రెస్ మరోసారి బలయ్యిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధాని నివాసం వెలుపల రాహులగ చేసిన ధర్నా , ఆ సందర్భంగా జరిగిన పరిణామాలు కేవలం ఒక సాధారణ నిరసన ప్రదర్శన మాత్రమే కాదని, ఇదొక పెద్ద రాజకీయ మైండ్ గేమ్‌గా స్పష్టమవుతోంది. తీవ్రమైన ప్రజా ఉద్యమాలను నీరుగార్చేందుకు అధికార పక్షం అందించిన సేఫ్టీ వాల్వ్ స్పేస్‌ను కాంగ్రెస్ వాడుకోవడం ద్వారా, తాత్కాలిక రాజకీయ లబ్ధి పొందినట్లు కనిపించినా దీర్ఘకాలికంగా మాత్రం క్షేత్రస్థాయి ఉద్యమాల తీవ్రత దెబ్బతిన్నదనేది ఎక్కువ మంది భావన.

# భూసేకరణ పూర్తయ్యాకే టెండర్లు

**హైదరాబాద్, జూలై 22(రాజముద్ర న్యూస్):**

హైదరాబాద్‌లో చేపడుతున్న మున్సిపల్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో జీహెచ్‌ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ కమిషనరేట్‌ల పరిధిలో కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.

**భూసేకరణకు ప్రాధాన్యం**

ఎలాంటి అభివృద్ధి పనులకైనా భూసేకరణ ప్రక్రియ పూర్తికాకుండా టెండర్లు పిలవొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. భూసేకరణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారిని ఇప్పటికే నియమించినట్లు తెలిపారు. అలాగే జీహెచ్‌ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ కమిషనరేట్‌ల పరిధిలోని ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు త్వరగా లభించేలా అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

**విగ్రహం, భవన నమూనాల పరిశీలన**

సైబరాబాద్ పరిధిలో ఏర్పాటు చేయనున్న మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహం, దానికి సంబంధించిన జంక్షన్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని హెచ్‌ఎండీఏ అధికారులకు సీఎం సూచించారు. అలాగే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ నూతన భవన నమూనా, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నమూనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. నగరంలో కొనసాగుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నమ్మించి వంచించాడు..

- **నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఎయిర్‌లైన్స్ ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ అత్యాచారం**

**హైదరాబాద్, జూలై 22(రాజముద్ర న్యూస్):**

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పనిచేస్తున్న ఓ ప్రైవేట్ విమానయాన సంస్థ క్యాబిన్ క్రూ ఉద్యోగినిపై ఆమెను విధులకు తీసుకెళ్తున్న క్యాబ్ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితురాలి నమ్మకాన్ని ఆసరాగా చేసుకున్న నిందితుడు ఆమెను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో క్యాబిన్ క్రూగా పనిచేస్తున్న బాధితురాలు జూలై 20న డ్యూటీ కోసం క్యాబ్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరింది. క్యాబ్ డ్రైవర్ ఎర్రపోగు ప్రశాంత్ కుమార్ మార్గమధ్యంలో వాహనాన్ని దారి మళ్లించి విమానాశ్రయం సమీపంలోని నిర్మాణంలో ఉన్న ఓ పాఠశాల వద్ద నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అనంతరం టాయిలెట్‌కు వెళ్లి వస్తానని చెప్పి వాహనం దిగిన అతడు తిరిగి వచ్చి బాధితురాలిపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

**వేగంగా స్పందించిన పోలీసులు**

ఘటన అనంతరం తీవ్ర ఆందోళనకు గురైన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అవుట్‌పోస్ట్ పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారంతో నిందితుడు ప్రశాంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అతడు నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం అతడిని రిమాండ్‌కు పంపింది. ఈ ఘటనతో శంషాబాద్ విమానాశ్రయం పరిసరాల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఉద్యోగుల రవాణా కోసం ఏర్పాటు చేసే క్యాబ్ సేవల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# రాహుల్ ది దేశ వ్యతిరేక వైఖరి

**మొదటిపేజీ తరువాయి**



ఎండగడుతూ బీజేపీ రాష్ట్ర శాఖ బుధవారం చేపట్టిన గాంధీ భవన్ ముట్టడి కార్యక్రమంతో నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయ పరిసరాలు ఉద్రిక్తంగా మారాయి. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు నాయకత్వంలో సీనియర్ నాయకులు, యువమోర్చా, కార్యకర్తలు భారీ ర్యాలీగా గాంధీ భవన్ వైపు బయలుదేరగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. పోలీసులకు వ్యతిరేకంగా బీజేపీ నినాదాలతో రాష్ట్ర కార్యాలయ ప్రాంగణం దద్దరిల్లింది. ఈ సందర్భంగా రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు కీలక సమావేశాలు జరుగుతున్న సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన రాహుల్ గాంధీ సభను బహిష్కరించి వీధి నాటకాలకు తెరలేపారని విమర్శించారు. 'నీట్' లీకేజీ అంశంపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ చర్చ నుంచి పారిపోయిన రాహుల్ గాంధీ ప్రధాని నివాసం ముట్టడికి దిగడం ఆయన అపరిపక్వతకు, చట్టసభల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం పురోగమిస్తుంటే తట్టుకోలేక రాహుల్, కేజ్రీవాల్‌ల ప్రేరణతో విచ్ఛిన్నకర శక్తులు దేశాన్ని విడగొట్టేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. గతంలో షాహిన్ బాగ్ రైతు ఉద్యమాన్ని ఏ విధంగానైతే దేశవ్యతిరేక శక్తులు హైజాక్ చేశాయో నేడు 'సిజేపి' పేరుతో జరుగుతున్న ధర్నా కూడా అదే తరహాలో సాగుతోందని రామచందర్ రావు ఆరోపించారు. దిల్లీలో నిరసనకు దిగిన వారిలో అసలు 'నీట' విద్యార్థులే లేరని, కేవలం యాంటీ సోషల్, అల్ట్రా లెఫ్ట్ మూకలను జమ చేసి ఆందోళనలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నిరసనల్లో ఆర్టికల్ 370 పునరుద్ధరణతోపాటు చైనా, పాకిస్తాన్‌లకు మద్దతుగా దేశ వ్యతిరేక నినాదాలు చేయడం దిగ్భ్రాంతికరమన్నారు. ఇతర దేశాల నుంచి వస్తున్న కోట్లాది విదేశీ సొమ్ము మాయలో పడి రాహుల్ గాంధీ విదేశీ ఏజెంట్‌లా మారి బంగ్లాదేశ్, నేపాల్ తరహాలో యువతను రెచ్చగొట్టే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అయితే భారతీయ యువత దేశ భక్తి కలిగిన వారని, దేశం కోసం ప్రాణాలిస్తారు తప్ప ఇలాంటి కుట్రలకు లొంగరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సాగిస్తున్న ఈ విధ్వంసకర రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ¾ పోరాటం కొనసాగుతుందని, పోలీసుల అరెస్టులకు భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

**రామచందర్‌రావును బేషరతుగా విడుదల చేయాలి : బండి సంజయ్**

తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్టును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఖండించారు. రాష్ట్రంలో పాలక పక్షం తీరు దారుణంగా ఉందని, అధికారంలో ఉండి ధర్నాలు, నిరసనలతో శాంతిభద్రతలను ఉల్లంఘిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ తీరు చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే అరెస్టు చేస్తారా అంటూ పాలకపక్షాన్ని ప్రశ్నించారు. 'నీట'పై పార్లమెంటులో చర్చకు ప్రభుత్వం సిద్ధం అంటూ దమ్ముంటే కాంగ్రెస్ నేతలు చర్చకు సిద్ధం కావాలి అని సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు అరెస్టును మెదక్ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా ఖండించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ధర్నాలు, రాస్తారోకోలతో పాలనను పక్కన పెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ తీరుకు ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. 'నీట్' అంశంపై పార్లమెంటులో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తున్నదని దుయ్యబట్టారు.

# ట్రాన్స్‌కో డీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

**హైదరాబాద్, జూలై 22(రాజముద్ర న్యూస్):**

ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ ముత్యం వెంకటరమణ నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన తొమ్మిది ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. మాదాపూర్‌లోని నివాసంలో రెండు ప్రత్యేక బృందాలు దాదాపు 12 గంటల పాటు తనిఖీలు చేపట్టాయి. ఈ సోదాల్లో నగదు, కీలక పత్రాలు, బంగారం, వజ్రాభరణాలు, విదేశీ మద్యం బాటిళ్లతో పాటు కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన మూడు కార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ముత్యం వెంకటరమణ రెడ్‌కోలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు.

**భార్య పేరుతో భారీ ఆస్తులు**

సోదాల్లో ముత్యం వెంకటరమణ భార్య స్వప్న పేరుతో భారీ స్థాయిలో ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆంజనేయనగర్, మూసాపేట్ ప్రాంతాల్లో 10 ఫ్లాట్లు, నాలుగు రెసిడెన్షియల్ ఫ్లాట్లు, జీ ప్లస్ 3 వాణిజ్య భవనాలు, ఖానామెట్ గుట్టల బేగంపేట్‌లో జీ ప్లస్ 5 వాణిజ్య భవనం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

**గతంలో లంచం కేసులో అరెస్ట్**

2019లో రూ.26 లక్షల లంచం తీసుకుంటూ ముత్యం వెంకటరమణ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన కార్యకలాపాలపై నిఘా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. విద్యుత్ శాఖలో వివిధ ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో అక్రమాస్తులు కూడబెట్టినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల వివరాలను పరిశీలిస్తూ మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ వెల్లడించింది.

# రాష్ట్రంలో 'పవర్ కట్ అనేదే లేదు

**మొదటిపేజీ తరువాయి**

విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై ఆయన బుధవారం సమీక్షించారు. సాధారణంగా వర్షాకాలంలో 11 వేల మెగావాట్లుగా ఉండే పీక్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు చేరడం, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేక 2,000 మెగావాట్ల జల విద్యుత్ (హైడల్ పవర్) నిలిచిపోవడం డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థపై తీవ్రమైన షాక్ లాంటి ఒత్తిడిని తెచ్చిందని భట్టి విక్రమార్క చెప్పారు. అయినప్పటికీ విద్యుత్ సిబ్బంది అహర్నిశలు శ్రమించి, ముందుచూపుతో పక్కా ప్రణాళికలను అమలు చేయడం వల్లే ఈ సంక్లిష్ట పరిస్థితులను దాటుకుని ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగుతున్నామన్నారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి బృహత్తర ఎత్తిపోతల పథకాలతోపాటు వర్షాభావంతో రైతులు బోర్ వెల్స్ ఎక్కువగా వాడటం వల్ల పెరిగిన విద్యుత్ అవసరాలను ప్రభుత్వం విజయవంతంగా తీర్చగలిగిందన్నారు. రాష్ట్రంలో 'పవర్ కట్' అనేదే లేదని, వర్షాలు, ఈదురుగాలుల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల స్తంభాలు, లైన్లపై చెట్లు కూలినప్పుడు మాత్రమే తాత్కాలికంగా విద్యుత్ అంతరాయం కలుగుతుందని, దీనిని ప్రజలు పవర్ కట్‌గా భావించవద్దని స్పష్టం చేశారు. 'ప్రజా బాట', 'పొలం బాట' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా అధికారులు స్వయంగా ప్రజల వద్దకే వెళ్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని అభినందించారు. గతంలో ఎక్కువ వడ్డీలతో తెచ్చిన పాత రుణాలను 'రీస్ట్రక్చరింగ్' చేయడం ద్వారా సంస్థల రుణ భారం తగ్గించి, ఎన్‌పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌లను దేశంలోనే నంబర్1 స్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. వైద్యారోగ్య శాఖ 108 అంబులెన్స్ సేవల తరహాలోనే విద్యుత్ సేవా ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు, నిచ్చెనలు, వైర్లతోపాటు నిపుణులైన ఇంజనీర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా విద్యుత్ అంబులెన్స్ వాహనాలను రంగంలోకి దించామన్నారు. వినియోగదారులు ఉచిత టోల్ ఫ్రీ నంబర 1912కు ఫోన్ చేయగానే కృత్రిమ మేధస్సు(ఏఐ) సాంకేతికత ద్వారా సమాచారాన్ని స్వీకరించి ఆటోమేటిగ్గా క్షణాల్లో సమాచారాన్ని అంబులెన్స్ సిబ్బందికి చేరవేస్తుందని, మెసేజ్ ఆధారంగా నిమిషాల వ్యవధిలోనే అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను తక్షణమే పరిష్కరిస్తుందని వివరించారు. విద్యుత్ వ్యవస్థకు మూలస్తంభాలైన లైన్‌మెన్, ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని ఉద్ఘాటిస్తూ విధి నిర్వహణలో అనుకోకుండా ప్రమాదం జరిగి సిబ్బంది మరణిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు రూ.1.20 కోట్ల బీమా సౌకర్యాన్ని కల్పించామని వివరించారు. అలాగే లైన్ క్లియరెన్స్ సమయంలో ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన సేఫ్టీ కిట్లు, యూనిఫారాలు అందించినట్లు తెలిపారు. మరోవైపు గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల బిల్లుల మొత్తాన్ని ఆర్థిక శాఖ డిస్కంలకు చెల్లిస్తోందని తెలిపారు. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఏటా అయ్యే రూ.14,000 కోట్ల సబ్సిడీ నిధులను కూడా ఆర్థిక శాఖ నేరుగా డిస్కంలకు విడుదల చేస్తోందని వెల్లడించారు.

**అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు**

సమీక్షకు తొలుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి నక్కలగుట్ట హనుమకొండలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. వాజ్‌పేj□YT కాలనీలో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం, ఆర్ అండ్ బీ క్వార్టర్స్‌లో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం, విద్యుత్ నగర్‌లో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ వద్ద 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం, నూతన సర్కిల్ కార్యాలయ భవనం హనుమకొండ, ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం 5వ అంతస్తు ప్రారంభోత్సవాలు జరిపారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీ 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. సమావేశంలో పాల్గొన్న దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ కలెక్టర్ సత్య శారద. జీడబ్ల్యూఎంసీ¾ కమిషనర్ వెంకన్న పాల్గొన్నారు.

**'ఎల్ నినో'పై కేటీఆర్‌కు అవగాహన లేదు : భట్టి**

'కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు' అంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి.రామారావు చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమెరికాలో చదువుకున్న, పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు ప్రపంచ వాతావరణ మార్పులు 'ఎల్ నినో' ప్రభావంపై కనీస అవగాహన లేకపోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో ప్రభావం వల్లే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, నిపుణులు వివరిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణకు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న పసిఫిక్ మహాసముద్రానికి ముఖ్యమంత్రి వెళ్లి ఏమైనా విపత్తులు సృష్టిస్తే ఇక్కడ కరువు వచ్చిందా అని ప్రశ్నించారు. అంతటి జ్ఞానం లేకుండా కేటీఆర్ మాట్లాడటం చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కావడం లేదన్నారు. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా మంచి సలహాలు ఇస్తే స్వీకరిస్తాం కానీ, దుర్మార్గమైన ఆలోచనలతో విషప్రచారం చేయవద్దు అని హితవు పలికారు. పదేళ్ల అధికార దుర్వినియోగంతో దోపిడీ చేసిన సొమ్ముతో ఏర్పాటు చేసుకున్న పత్రికలు, ఛానళ్ల ద్వారా ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు బురదజల్లుతున్నారని, ఈ అబద్ధపు ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని గొప్పలు చెప్పుకున్నారు..కేవలం 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు మూడేళ్లకే ఎందుకు కుంగిపోయాయి అని నీటిపారుదల శాఖ మాజీ మంత్రి హరీశ్ రావును నిలదీశారు. కాళేశ్వరం కంటే ఎగువన గత కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 20 టీఎంసీల సామర్థ్యంతో నేటికీ నిటారుగా, సురక్షితంగా ఉండి లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నదని తెలిపారు. అలాగే ఆరు దశాబ్దాల క్రితం కాంగ్రెస్ నిర్మించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కూడా గోదావరి ఉధృతికి చెక్కుచెదరకుండా నిలబడిందని గుర్తుచేశారు. అదే గోదావరి నది.. అదే ఇసుక పునాదిపై కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా సురక్షితంగా ఉండగా బీఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ కేవలం మూడేళ్లలోనే ఎందుకు కుంగిపోయిందని ప్రశ్నించారు. సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

# నన్ను దెబ్బతీయడానికి కుట్రలు

**కొడంగల్, జూలై 22 :**

కొడంగల్ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతోనే తనకు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో తనను దెబ్బతీయాలంటే కొడంగల్‌లోని తన పునాదులు కూల్చాలని చూస్తున్నారని ఆరోపించారు.పేర్లు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనన్నారు. ఎస్ఐఆర్ ఫారంలో వివరాలు నమోదు చేసుకున్న అనంతరం ఆ కార్యక్రమంపై కార్యకర్తలు, నాయకులు, బీఎల్ఏలకి బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కొడంగల్‌లో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని చూస్తున్నారని, ఇంట్లో పొగ పెడితే రేవంత్ రెడ్డి బయటకు రాకుండా ఉంటారని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎదురు నిలబడలేక దొంగదెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారన్నారు. 119 నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు రోజుకు 18 గంటలు పనిచేసినా తనకు సమయం సరిపోవడం లేదన్నారు. కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత మీపై ఉందని అన్నారు. ఆగస్టు 3 వరకు ఎస్ఐఆర్ గడువు ఉందన్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓట్లలో ఇప్పటివరకు 1,96,620 ఓట్లు ప్రక్షాళన అయ్యాయని, ఇంకా నమోదు చేసుకోనివారి సంఖ్య 54,635 అంటే మొత్తం ఓట్లలో ఇంకా 22 శాతం ఉందని ఆయన తెలిపారు. ఆ ఓట్లను తొలగించే ప్రమాదం పొంచి ఉందని, వారందరినీ తిరిగి నమోదు చేయించాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని చెప్పారు. ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదు.. కార్యకర్తగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ ఫారం నమోదు చేయించాలి అని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఓటర్ల వివరాలను ఎన్నికల అధికారులకు అందించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందన్నారు. ఈ నెల 30లోగా నూటికి నూరు శాతం నియోజకవర్గంలో ప్రక్షాళన పూర్తి కావాలని, అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు కోల్పోవడానికి వీల్లేదని అన్నారు.

# సీసీఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి?

**మొదటిపేజీ తరువాయి**

హామీలను గుర్తు చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్త శుద్ధి లోపం వల్లే జాప్యం జరిగిందని.. సీసీఐపై ఆరు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవలే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీసీఐ సాధన సమితి బృందం దిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు / ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిందని తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ డియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ప్లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు కు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా కు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.

# నీట్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్, జూలై 22(రాజముద్ర న్యూస్):**



నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ చీఫ్ కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నీట్ లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. పరీక్షను సక్రమంగా నిర్వహించలేక పోయిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై దాష్టీకానికి పాల్పడిందని విమర్శించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, విద్యార్థినులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని కవిత పేర్కొన్నారు. విద్యార్థినులను రోడ్లపై పరుగులు పెట్టించి రక్తం వచ్చేలా కొట్టడం అత్యంత అమానుషమని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారత్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని విమర్శించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా 25 లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని, 21 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనలకు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తూ, విద్యార్థుల మరణాలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై పోలీసుల దాష్టీకాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారని, విద్యార్థులపై విరిగిన ప్రతి లాఠీకి, వారు చిందించిన ప్రతి రక్తపు చుక్కకు ప్రజలు ఓటు రూపంలో సమాధానం చెబుతారని కవిత వ్యాఖ్యానించారు. విద్యార్థుల పట్ల ఇలాంటి వైఖరిని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని అన్నారు. నీట్ లీకేజీకి బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా నిరాహార దీక్ష చేస్తున్న సోనం వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదని, వారి సమస్యలను బలప్రయోగంతో అణచివేయకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కల్వకుంట్ల కవిత కోరారు.


# హాస్పిటల్ నుంచి ట్రైనీ ఐపీఎస్ డిశ్చార్జి

**హైదరాబాద్, జూలై 22(రాజముద్ర న్యూస్):**

మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. మూడు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆయనను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించగా, ఆరోగ్యం మెరుగుపడటంతో వైద్యులు ఆసుపత్రి నుంచి విడుదల చేశారు.

**దర్యాప్తు ముమ్మరం**

ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన అనంతరం తనపై వచ్చిన ఆరోపణలపై స్పందించేందుకు ఉదయ్ కృష్ణారెడ్డి నిరాకరించారు. మరోవైపు కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. బాధితురాలైన మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి వాంగ్మూలాన్ని షీ టీమ్ అధికారులు ఇప్పటికే నమోదు చేశారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా, ఆ పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం సోమవారానికి వాయిదా వేసింది. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# పార్లమెంట్ ఎజెండాలో 'నీట్'పై చర్చ ఏది?

## అధికార పక్షానిదే వైఫల్యం!

**లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు చిన్నాభిన్నమవుతున్నా కేంద్రం నిర్లక్ష్యం**

తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే..పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్టీఏ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే... పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదేశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ డానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠిచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్ధవంతంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు.ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలోప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది. నీట్‌పై చర్చించి, లీకులు లేకుండా, అన్ని రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటే మంచిది.

# మూడోరోజూ పార్లమెంట్‌లో గందరగోళం

- విపక్షాల నిరసనలతో హోరెత్తిన సభ
- నల్ల చొక్కలాతో పార్లమెంట్ ముందు విపక్షాల నిరసన



**న్యూఢిల్లీ, జులై 22:** వరుసగా మూడో రోజు కూడా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టబట్టడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. బుధవారం కూడా లోక్‌సభ, రాజ్యసభలో గందరగోలం నెలకొన్నది. దీంతో రెండు సభలు 12 గంటల వరకు వాయిదా పడ్డాయి.తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ చేపట్టాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. కానీ ఫలితం కనిపించలేదు. ప్రశ్నోత్తరాల సమయం జరిగే రీతిలో విపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. ఎటువంటి సమస్యపైన అయినా చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. కానీ విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా విపక్షాలు సీజేపీపై లాఠీచార్జ్ అంశాన్ని చర్చించాలని పట్టుపట్టాయి. కానీ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ వ్యతిరేకించారు. గందరగోళ నేపథ్యంలో సభను 12 వరకు వాయిదావేశారు. మరో వైపు విపక్ష ఎంపీలు ఇవాళ నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. నీట్ పేపర్ లీకేజీ అంశంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా నల్ల దుస్తులు ధరించినట్లు కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా ఆరోపించారు.

# నీట్‌పై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం: కేంద్రం

- ప్రశ్నపత్రం లీక్‌ను 'ఘోర పాపం'గా అభివర్ణించిన ప్రధాని
- ప్రతిపక్షం చర్చకు బదులు ఆందోళనల మార్గం ఎంచుకుందని కేంద్రం విమర్శ
- విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పరీక్షను మళ్లీ నిర్వహించామని వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 22:** నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర వర్గాలు వెల్లడించాయి. ప్రతిపక్షం చర్చ కోరితే ప్రభుత్వం ఎప్పుడూ వెనుకడుగు వేయలేదని స్పష్టం చేశాయి. ఈ అంశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తూ, నీట్ ప్రశ్నపత్రం లీక్‌ను 'ఘోర పాపం'గా అభివర్ణించినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. నీట్ లీక్ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు అంగ్రీకరించినప్పటికీ, ప్రతిపక్షం ఆందోళనలకే ప్రాధాన్యం ఇచ్చిందని కేంద్రం విమర్శించింది. విద్యార్థుల నిరసనలకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంతో ఈ అంశం మరింత రాజకీయ రంగు పులుముకుందని పేర్కొంది. నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై పూర్తి స్థాయి చర్చ నిర్వహించాలని, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో చర్చ జరపాలని ప్రతిపక్షం పట్టుబడుతోంది. ఇదిలా ఉండగా, ఎన్‌డీఏ ఎంపీల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ అంశంపై మాట్లాడినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ప్రశ్నపత్రం లీక్ ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించి అవసరమైన చర్యలు చేపట్టిందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నీట్ పరీక్షను తిరిగి నిర్వహించినట్లు ప్రధాని వివరించారని తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, నీట్ వ్యవహారంపై పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది.



# విద్యార్థులపై కేసులు పెట్టొద్దు..

## కేంద్రానికి సోనమ్ వాంగ్‌చుక్ లేఖ..

**న్యూఢిల్లీ, జులై 22:** సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు బుధవారం లేఖ రాశారు. నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు పెట్టొద్దని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. విద్యార్థులపై కేసులు పెట్టబోమని కేంద్రం హామీ ఇవ్వాలని కోరారు. కేంద్రం హామీ ఇస్తే దీక్ష విరమిస్తానని స్పష్టం చేశారు. కేంద్రం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే తన దీక్ష కొనసాగుతుందని తేల్చి చెప్పారు.

### ఆస్పత్రిలో కొనసాగుతున్న దీక్ష..

విద్యా వ్యవస్థలో వైఫల్యాలపై సోనమ్ వాంగ్‌చుక్ జూన్ 28వ తేదీనుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయన ఆరోగ్యం క్షీణించటంతో హైకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు కొద్దిరోజుల క్రితం జంతర్ మంతర్ వద్ద నుంచి ఆయననను బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. మొదట సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రికి మార్చారు. ఆయన అక్కడి ఐసీయూలో ఉంటూనే.. డాక్టర్ల బలవంతపు ఫీడింగ్‌ను నిరాకరిస్తూ దీక్షను కొనసాగిస్తున్నారు.

# చలో సంసద్‌పై పోలీసుల లాఠిన్యం


## అత్యవసర చర్చకు సుప్రీం తిరస్కరణ




**న్యూఢిల్లీ,జులై 22:** కాక్రోచ్ జనతాపార్టీ 'చలో సంసద్' మార్చ్‌లో భాగమైన నిరసనకారులపై పోలీసు లాఠీఛార్జ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే.. దాని అత్యవసర విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని.. అలాగే పిటిషనర్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..'మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్ అత్యవసర విచారణకు దిల్లీ హైకోర్టు కూడా నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ అంశంలోకి తమను లాగొద్దని వ్యాఖ్యానించింది. దాంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ లాఠీఛార్జిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్ కోరారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంటు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకుని బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. పలుచోట్ల రాళ్లు రువ్వడం, ఘర్షణ పడటం, తోపులాటలతో అటు పోలీసులు, ఇటు ఆందోళనకారులు గాయపడ్డారు. చాలా మంది రక్తమోడుతున్న వీడియోలు వైరలయ్యాయి. వీటిని చూపుతూ విచారణ కోరారు. అయితే సుప్రీం ప్రధాన న్యాయమూర్తి వాటిని తిరస్కరించారు. అత్యవసరంగా చర్చించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

# 10 ఏళ్లలో 152 పేపర్ లీకులు: రాహుల్ గాంధీ

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్
- విద్యా వ్యవస్థ రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపణ
- విద్యార్థులకు ప్రధాని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత డిమాండ్



**న్యూఢిల్లీ, జూలై 22:** గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 152 పేపర్ లీక్ ఘటనలు వెలుగు చూశాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇన్ని ఘటనలు జరిగినప్పటికీ ఒక్క కేసులోనూ అసలు దోషులను గుర్తించి శిక్షించలేదని విమర్శించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై ఉద్యమిస్తున్న విద్యార్థులకు మద్దతుగా బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో దేశ విద్యా వ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించిన రాహుల్ గాంధీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా మారిందని అన్నారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు కూడా ఇదే డిమాండ్ చేస్తున్నారని, అది పూర్తిగా సమంజసమైనదేనని పేర్కొన్నారు. గత పదేళ్లలో సగటున ప్రతి వారం ఒక పేపర్ లీక్ జరిగినట్లేనని రాహుల్ గాంధీ అన్నారు. ఈ ఘటనల వల్ల కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నప్పటికీ, ఇప్పటివరకు ఏ కేసులోనూ బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ పరిస్థితిపై విద్యార్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు దేశానికి బలమైన ఆస్తిగా నిలిచిన విద్యారంగం ఎన్డీఏ పాలనలో దెబ్బతిందని రాహుల్ ఆరోపించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య భారంగా మారిందన్నారు. నీట్ పరీక్ష కోసం కోచింగ్‌కు అభ్యర్థులు ఏటా సుమారు రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇది కేంద్ర విద్యాశాఖ వార్షిక బడ్జెట్ అయిన రూ. 1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ సంపన్నులకు మాత్రమే అనుకూలంగా మారిందని, పేద విద్యార్థులకు అవకాశాలు తగ్గుతున్నాయని విమర్శించారు. ఇటీవల విద్యార్థుల నిరసనల సందర్భంగా జరిగిన లాఠీచార్జ్‌పై స్పందించిన రాహుల్ గాంధీ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన ఘటనకు ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు.

# పీజేఆర్ స్టేడియంలో ఘనంగా"ఛాత్రో కి గూంజ్" కార్యక్రమం

**విద్యార్థుల సమస్యలపై ఎన్ఎస్‌యూఐ పోరాటం**



**చందానగర్, రాజముద్ర న్యూస్ :** విద్యార్థుల సమస్యలు, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఎన్ఎస్‌యూఐ శేరిలింగంపల్లి ఆధ్వర్యంలో చందానగర్ పీజేఆర్ స్టేడియంలో "ఛాత్రో కి గూంజ్" కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. టీపీసీసీ మీడియా చైర్మన్ సామ రామోహన్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యాదవల్లి వెంకటస్వామి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేలకొండపల్లిలో బీజేపీకి బలం పెరుగుతోంది

- గ్రామాల నుంచి పలువురు బీజేపీలో చేరిక
- మోదీ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వెల్లడి



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి,భారతీయ జనతా పార్టీ నేల కొండపల్లి మండలంలో దూసుకుపో తోంది.బీజేపీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ఆధ్వర్యంలో మండలంలోని 3 గ్రామాల నుంచి పలువురు నేతలు, కార్యక ర్తలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.అప్పలన ర్సింహాపురం, కట్టుకచారం, రాయగూడెం గ్రామాల నుంచి వచ్చిన నాయకులు శనివారం నేలకొండపల్లిలో పాగర్తి సుధాకర్ సమక్షంలో బీజేపీలో చేరారు. చేరిన వారిలో శీలం హరీష్, తుంగం స్వామి, యేన్నబోయిన నర్సింహారావు తది తరులు ఉన్నారు. వారందరికీ పాగర్తి సుధాకర్ స్వయంగా బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ, "ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలన కు ఆకర్షి తులై ఈరోజు పలువురు బీజేపీలో చేరారు. రానున్న రోజుల్లో నేలకొండపల్లి మండలంలో పెద్దఎత్తున చేరికలు ఉంటాయి" అని ధీమా వ్యక్తం చేశారు."ఈరోజు యువత చూపు మొత్తం బీజేపీ వైపే ఉంది. మోదీ పాలన పట్ల ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈరోజు మనకు జరుగుతున్న అభివృద్ధి అంతా ఎక్కువగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులే" అని ఆయన అన్నారు."అనేక కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటి ద్వారా వచ్చే సంక్షేమ ఫలాలు చిట్టచివరి వ్యక్తి వరకు చేర్చడమే బీజేపీ లక్ష్యం. ఇదే మా పార్టీ మూలసి ద్ధాంతం" అని పాగర్తి సుధాకర్ స్పష్టం చేశారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవింద రావు, కాళంగి వెంకటేశ్వర్లు, పోతనబో యిన శేషగిరి, సయ్యద్ మోహినూద్దీన్, జెల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రంజిత్ రెడ్డిని, చల్లా నరసింహారెడ్డిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు





**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపల్, మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు మడపతి చంద్రమౌళి, బొల్లారం వెంకటరెడ్డిలు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రెసిడెంట్ చల్లా నరసింహారెడ్డిని, చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డిని బుధవారం రోజు మర్యాదపూర్వకంగా కలిసి, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు మడపతి చంద్రమౌళి బొల్లారం వెంకటరెడ్డి మాట్లాడుతూ... తమపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవులు తమకు కేటాయించినందుకు కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. మున్సిపల్, మండల కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చేకూర్తి గోపాల్ రెడ్డి, కౌన్సిలర్ లు గణేష్, ఆనంద్, నాయకులు కావలి గోపాల్, పార్శి బాలకృష్ణ, నరేందర్ రెడ్డి, కాంత్ రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అగ్ర నేతలు అరెస్ట్ ప్రజాస్వామ్య హక్కుల పై దాడి...

- రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ అరెస్టులు అప్రజ్యస్వామికం...
- యువత భవిష్యత్తు కోసమే రాహుల్ గాంధీ నిరసన...
- నియంత్రత్వ నరేంద్ర మోడీ ప్రభుత్వం నుండి దేశాన్ని కాపాడాలి అంటూ సంకెళ్లతో నిరసన ప్రదర్శన



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడమే కాకుండా టియర్ గ్యాస్ ప్రయోగించి విద్యార్థులను దారుణంగా కొట్టినటువంటి సంఘటనలకు వ్యతిరేకంగా,ఆ సమయంలో విద్యార్థులకు మద్దతుగా వచ్చినటువంటి కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి,ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ ఆలి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది,డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ తదితరులు తమ చేతులకు సంకెళ్లు వేసుకొని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ బిజెపి లు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని వారి కబంధ హస్తాల నుండి దేశాన్ని రక్షించడానికి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా యువత కదలి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,, కౌన్సిలర్లు డాక్టర్ ఊర రామమూర్తి యాదవ్, కుంభం రాజేందర్, పిల్లల రమేష్ నాయుడు, ఫారుక్ ,చంచల నిఖిల్ ,ఎస్ ఎస్ సాజిద్ భైరు వెంకన్న గౌడ్,బంటు చొక్కయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆషాఢ మాసంలో అమ్మవారి దర్శనం కోసం భారీగా భక్తులు

## మాదాపూర్ కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**మాదాపూర్, రాజముద్ర న్యూస్ :** మాదాపూర్ గుట్టల బేగంపేట్ కాకతీయ హిల్స్‌లోని శ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో ఆషాడ మాసం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా ఆషాడ మాసంలో జరిగే ఈ ప్రత్యేక పూజలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు వస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి దర్శనంతో సకల శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వాసంతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ పై బాధ్యులపై పీడీ యాక్ట్ పెట్టాలి

**వర్కల శివకిశోర్ గౌడ్**



**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** నీట్ పేపర్ లీకేజీలు, విద్యా వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే నిందితులపై 'పీడీ యాక్ట్' నమోదు చేసి 10 సంవత్సరాల వరకు బెయిల్ రాని చట్టాన్ని పార్లమెంట్ లో బిల్లు రూపొందించాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కో– కన్వీనర్ వర్కల శివ కిశోర్ గౌడ్ డిమాండ్ చేసారు. అలాగే న్యాయబద్ధంగా జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులపై విద్యార్థులపై ఎలాంటి కేసులు లేకుండా బేషరతుగా విడుదల చేయాలనీ వర్కల శివ గౌడ్ పత్రిక ప్రకటనలో తెలిపారు. నీట్– 2026 పేపర్ లీక్ వల్ల 22.79 లక్షలాది మంది విద్యార్థుల జీవితాలపై తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. ఎంతో మంది విద్యార్థులు తమ భవిష్యత్ బంగారు బాటల వైపు అడుగులు వేస్తున్నాయాని కన్న కలలు, కల కలగానే మిగిలిపోయాయని కుమిలీ పోతున్నారు. అంకితభావంతో చదివిన విద్యార్థులకు అన్యాయం జరగడం, పేపర్ లికేజీ వల్ల పరీక్షల రద్దు చేసి మళ్ళీ నిర్వహించిన సంగతి విధితమే, దీని వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడి, ఆత్మహత్యల వంటివి వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించి భవిష్యత్ లో ఎలాంటి ప్రభుత్వ పరీక్షలకు సంబంధించిన పేపర్ లికేజీ చేస్తే 10 సంవత్సరాలు కఠిన శిక్షలు అమలయ్యేల చట్టం రూపొందించాలని ఆయన అన్నారు.

# ఎల్ నినో ప్రభావంపై నేడు ప్రత్యేక అవగాహన కార్యక్రమం

- గ్రామాలలో నీటి సంరక్షణపై "తెలంగాణ జలసిరి" పై అవగాహన
- జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో అధ్యక్షతన కార్యక్రమం



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ విపత్తులను ఎదుర్కొనుటకు నేడు ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయం శంకర్ పల్లి లో జలసిరి, ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడబోయే సమస్యలు, వాటి కొరకు తీసుకోవాల్సిన జల సంరక్షణ పనులు మొదలగు అంశాల గురించి మండల స్థాయి అధికారులతో, ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన తెలంగాణ ప్రభుత్వం చేపట్టబోతున్న పనులకు సంబంధించిన తెలంగాణ జలసిరి అనే గోడ పత్రికను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగిందని తెలిపారు. కావున ఇట్టి కార్యక్రమానికి అందరూ మండల స్థాయి అధికారులు, ఇంజనీర్లు పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు హాజరుకావాలని శంకర్ పల్లి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ కోరారు.

# ఆలయ అభివృద్ధికి రూ.51 వేల విరాళం అందించిన అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి

**శ్రీ భువనేశ్వరి సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**దేవాలయాల అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని చేవెళ్లకు చెందిన సామాజిక కార్యకర్త అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి అన్నారు. తన జన్మదినం సందర్భంగా బుధవారం రోజు చేవెళ్ల మున్సిపల్ పరిధి మల్కాపూర్ వార్డులో శ్రీ భువనేశ్వరి సమేత మల్లికార్జునస్వామి దేవాలయాన్ని సందర్శించిన ఆయన ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా రూ.51 వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కిట్టు ప్రత్యేక పూజలు నిర్వహించి వేదాశీర్వచనం అందించారు. అనంతరం జగన్నాథ్ రెడ్డి మాట్లాడుతూ.... ఆలయ అభివృద్ధిలో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని, దాతల సహకారంతో దేవాలయాలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామ పెద్దలు అత్తెల్లి జగన్నాథ్ రెడ్డిని అభినందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు భాగ్యమ్మ, భవాని, శ్రీనాథ్ రెడ్డి, మౌనిక, శ్రీమాన్ రెడ్డి, శ్రీనికేత్ రెడ్డి, వీహ, గ్రామస్తులు మహమ్మద్ మోసిన్, దేవుని రాములు, లింగం, నాగభూషణం, పురుషోత్తం, శర్వలింగం, రవికుమార్ (ఆర్.కె), చామంతి శివరాజ్, సామ మాణిక్య రెడ్డి, ఆంజనేయులు గౌడ్, మహమ్మద్ యాసిన్, జాహేద్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# ఏఈఓ ను సన్మానించిన సర్పంచ్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి నూతనంగా వచ్చిన ఏఈఓ శిల్పను గ్రామ సర్పంచ్ మనిషా రామస్వామి శాలువాతో సత్కరించారు, మా గ్రామానికి అన్ని విధాలుగా రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు సూచనలు చేయాలని తెలిపారు, ఏఈఓ శిల్ప మాట్లాడితు ఎల్ నీనో ప్రభావం వలన ఈ సంవత్సరం వర్షపాతం తక్కువ ఉన్నందున ఆరుతడి పంటలు వేసుకోవాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్యాల రాజు, సెక్రెటరీ బండి నరేష్, వార్డ్ మెంబర్స్ బాల్రాజ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజాకోణం తెలుగు దిన పత్రిక

# మొయినాబాద్ మున్సిపల్ కార్మికులకు పారిశుద్ధ సామాగ్రి ఇవ్వాలి

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**



**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు మొయినాబాద్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు పారిశుద్ధ్య సామాగ్రి ఇవ్వాలని కార్యాలయం ముందు బుధవారం ఆందోళన నిర్వహించడం జరిగింది. శానిటేషన్ ఇన్స్పెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ.... మొయినాబాద్ మున్సిపల్ కార్మికులకు సబ్బులు నూనెలు, గ్లౌజులు ఇతర సామాగ్రి ఇవ్వకుండా, సామాగ్రి కొనుగోలు చేసి రెండు నెలలు గడుస్తున్న... కార్మికులకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఐటియు డిమాండ్ చేస్తుందని అల్లి దేవేందర్ అన్నారు. మొయినాబాద్ పురపాలక సంఘం ఏర్పడి నెలలు గడుస్తున్న కార్మికులకు కనీసం గుర్తింపు కార్డులు ఇవ్వలేరని, చాలామంది కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయడం లేదని మండిపడ్డారు. వెంటనే మున్సిపల్ కార్మికులకు పారిశుద్ధ్య సామాగ్రి, వర్షాకాలపు రైన్ కోట్స్ ఇవ్వాలని లేని పక్షంలో విధులు బహిష్కరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మొయినాబాద్ మండల కన్వీనర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్, సిఐటియు మండల నాయకులు రామచందర్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు సుధాకర్, ఉపాధ్యక్షులు కృష్ణ, మున్సిపల్ కార్మికులు, ఎలక్ట్రిషన్లు, వాటర్ మాన్లు తదితరులు పాల్గొన్నారు

# మోదీ నిరంకుశత్వానికి రాహుల్ గాంధీ అరెస్టే నిదర్శనం

- విద్యార్థుల, నిరుద్యోగుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం - తుంబూరు దయాకర్ రెడ్డి
- ప్రధాని మోదీ, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఏదులాపురం, పోటీ పరీక్షల పేపర్ లీకేజీలతో దేశంలోని లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత జీవితాలను నాశనం చేస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ ప్రశ్నించినందుకు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం మోదీ నిరంకుశత్వానికి నిదర్శన మని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మండిపడ్డారు.రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. సత్యనారాయణపురం రాంలీలా ఫంక్షన్ హాల్ నుండి ప్రధాన వీధుల గుండా ప్రదర్శనగా వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, "పేపర్ లీకేజీల వల్ల కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తు రోడ్డున పడుతోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది" అని ధ్వజమెత్తారు.విద్యార్థుల, నిరుద్యోగుల తరపున గొంతు విప్పిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై పోలీసులతో బలప్రయోగం చేయించడం సిగ్గుచేటు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే" అని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు."అరెస్టులకు, అక్రమ కేసులకు కాంగ్రెస్ శ్రేణులు భయపడేది లేదు. విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల సాధన కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఖమ్మం రూరల్ మండల, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు, యువత, నిరుద్యోగుల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం

- 152 పేపర్లు లీక్ అయితే ఎంత మందిపై చర్యలు తీసుకున్నారూ...??
- సూర్యాపేట నుంచి వినిపించే మీ గొంతు ఢిల్లీ వరకు వినిపించాలి
- ప్రతి విద్యార్థి ఛత్రోస్ గూంజ్ లో నమోదై మీ ప్రతి ధ్వని వినిపించాలి



**సూర్యాపేట,రాజ ముద్ర న్యూస్:** సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో సృజన స్కూల్ గ్రౌండ్స్ లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు విద్యార్థుల సమస్యలపై యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలోయువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగిరెడ్డి మమత సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ఛాత్రోన్ కీ గూంజ్" కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, గుంటూరు మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలీ కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి,ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ప్రధాన కార్యదర్శి చెకిలం రాజేశ్వరరావు, డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది పాల్గొన్నారు ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ఎన్‌టీపీ పరీక్షల్లో వరుస పేపర్ లీకులు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీక్‌లకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని కోరారు. ప్రతి విద్యార్థి "ఛాత్రోన్ కీ గూంజ్"లో నమోదు చేసుకుని తన స్వరాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు కష్టపడి చదివించిన తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు కష్టపడి చదివిన విద్యార్థుల ఆశలు పేపర్ లీకేజి రూపంలో అడియాశలు అయ్యాయని వారి కోసమే కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఢిల్లీలో పోరాడుతున్నారని అన్నారు.ప్రతి విద్యార్థి "ఛాత్రోన్ కీ గూంజ్"లో నమోదు చేసుకుని తన స్వరాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు.

# హౌసింగ్ బోర్డ్ ఆరో ఫేసులో అక్రమ సెల్లార్

- వరుస కథనాలకు కూడా స్పందించని టౌన్ ప్లానింగ్ విభాగం
- "పై అధికారులకు ఎప్పుడో ముట్ట చెప్పాము" అంటూ నిర్మాణదారుడు ధీమా




**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని కెపిహెచ్బి ఆరవ ఫేస్‌లో నిబంధనలను బేఖాతరు చేస్తూ సాగుతున్న అక్రమ సెల్లార్ నిర్మాణాలపై వరుసగా కథనాలు వెలువడుతున్నా టౌన్ ప్లానింగ్ విభాగం మాత్రం మౌనం వీడడం లేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు, మీడియాలో వరుస కథనాలు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. స్థానికుల సమాచారం ప్రకారం, అనుమతులకు విరుద్ధంగా భారీ సెల్లార్ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు కళ్లుమూసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ఎలాంటి తనిఖీలు నిర్వహించకపోవడం, నిర్మాణాలను అడ్డుకోకపోవడంతో నిర్మాణదారులు మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై నిర్మాణదారుడి ధీమా మరింత చర్చనీయాంశంగా మారింది. "ఈ విషయం పై అధికారులకు ఎప్పుడో చెప్పాం... కింది స్థాయి అధికారులు ఏమీ చేయలేరు" అంటూ ఆయన బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు అధికార యంత్రాంగంపై పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఉన్నతాధికారుల అండదండలు లేకుండానే ఇలాంటి ధీమాతో మాట్లాడగలరా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందా? లేక ఉద్దేశపూర్వకంగా మౌనం పాటిస్తోందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే నగరంలో అక్రమ నిర్మాణాలకు మరింత ప్రోత్సాహం లభించే ప్రమాదం ఉందని పట్టణాభివృద్ధి నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అక్రమ సెల్లార్ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై ప్రజల విశ్వాసం పూర్తిగా దెబ్బతింటుందని వారు హెచ్చరిస్తున్నారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం రామారెడ్డి పట్టణంలోనీ బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్ , ఈసన్నపల్లి సర్పంచ్ దోకి లచ్చయ్య, జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ రంగు రవీందర్ గౌడ్, ఏఎంసి డైరెక్టర్ రావుఫ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు నామాల రవి, మండల యూత్ అధ్యక్షులు రంజిత్, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ అద్వాన్, మండల బిసి సెల్ అధ్యక్షులు జెసిబి శేఖర్, మండల యూత్ఉప అధ్యక్షులు జాషువా, వార్డు సభ్యులు పిప్పరి లింబాద్రి ,ఈసాయిపేట హరీష్ ,కన్నాపూర్ తాండ యూత్ అధ్యక్షులు మైపాల్, సుమన్, సీనియర్ కార్యకర్తలు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వంటి అంశాలపై విద్యార్థులకు అండగా నిలిచి ప్రశ్నించిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. దేశ యువత భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వం పేపర్ లీకేజీలను అరికట్టడంలో విఫలమైందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ప్రశ్నించిన వారిపైనే నిర్బంధ చర్యలకు పాల్పడటం ఖండనీయమని అన్నారు.ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పిలుపు,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా రామారెడ్డి లో కూడా ఈ కార్యక్రమాన్నినిర్వహించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుంది అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మేడిపల్లి లయన్స్ క్లబ్‌లో నూతన ప్రతినిధుల ప్రమాణ స్వీకారం

- జిల్లా గవర్నర్ హాజరులో మేడిపల్లి లయన్స్ క్లబ్ 2026-27 సంవత్సరానికి గాను నూతన కమిటీ స్వీకార వేడుక
- కొత్త బృందంతో లయన్స్ క్లబ్ సామాజిక సేవలకి మరింత శక్తి




**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మేడిపల్లి సంపూర్ణ హోటల్ లో జోనల్ చైర్ పర్సన్ నాదం గౌడ్ అధ్యక్షతన నూతన ప్రతినిధుల పదవి స్వీకార వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా 320ఎఫ్ గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2026–27 సంవత్సరానికి ఎన్నికైన కొత్త నాయకులుగా రాజోజు నరసింహాచారి అధ్యక్షుడిగా మేకల మల్లేషం, ప్రధాన కార్యదర్శిగా, పల్లె బాలరాజు, కోశాధికారిగా లయన్ హరికృష్ణ రెడ్డి ఇన్స్టాలేషన్ అధికారిగా వ్యవహరించి నియమ నిబంధనలను తెలుపుతూ పదవి స్వీకార ప్రమాణం చేయించారు. జిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ కు నూతనంగా ఎన్నికైన నాయకులు తమ అభియోగాల్లో క్లబ్ సేవల పరిధిని విస్తరించడం, ఆరోగ్యశిబిరాల నిర్వహణ, విద్యా శిక్షణ కార్యక్రమాలు, వృద్ధులకు సహాయ చర్యలు ఇతర సామాజిక సంక్షేమ కార్యక్రమాలలో కృషిచేయడానికి తగు సూచనలు ఇస్తూ సంకల్పం వ్యక్తం చేశారు. జోనల్ చైర్పర్సన్ నాదం గౌడ్ మాట్లాడుతూ... మేడిపల్లిలో లయన్స్ క్లబ్ ఏర్పడిన రెండు సంవత్సరాల లోపే ఘట్కేసర్ లో క్లబ్ ఏర్పాటు చేశామని, అదేవిధంగా ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టి ఉత్తమ లయన్స్ క్లబ్బుగా మేడిపల్లి క్లబ్ పేరు తెచ్చుకుందని చెప్పారు. మేడిపల్లి లయన్స్ క్లబ్ ఈ సంవత్సరం అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టనుందని, సమగ్ర పథకాలు త్వరలో ప్రకటిస్తామని అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా లయన్ రమణారెడ్డి, జైన రమేష్, లయన్ కన్న పరశురాములు, లయన్ లవ్ కుమార్ రెడ్డి, లయన్ చొప్పరి శ్రీనివాస్, మేడిపల్లి, ఘట్కేసర్ లయన్ సభ్యులు హాజరయ్యారు. మేడిపల్లి లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు విజయవంతంగా జరగడానికి సహకరించిన జిల్లా గవర్నర్ లయన్ సుధాకర్ రెడ్డి కి, జిల్లా లయన్స్, స్థానిక లయన్స్ సభ్యులకు లఘు ప్రధాన కార్యదర్శి మేకల మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు.

# జూలై 24న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

- కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి
- ఎన్ఎస్యు ఐ మండల కమిటీ సభ్యులు శాంసన్, సమీరుద్దీన్, ఇర్ఫాన్

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** దేశవ్యాప్తంగా విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలు, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, విద్యా వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎన్ఎస్యు ఐ తెలంగాణ, ఎస్ ఎఫ్ ఐ, ఎఐఎస్ ఎఫ్, పిడిఎస్ యు, ఎఐఎఫ్డిఎస్, ఏఐఎస్బి, ఏఐ పిఎస్ యు తదితర వామపక్ష విద్యార్థి సంఘాలతో కలిసి, జూలై 24న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఎన్ఎస్యు ఐ చేవెళ్ల మండల కమిటీ సభ్యులు ఎండీ సమీరుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ విద్యార్థుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా, తెలంగాణలోని విద్యార్థులు ఈ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల గొంతును అణచివేయాలనే ప్రయత్నాలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటామని అన్నారు.

**కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆయన ఈ క్రింది డిమాండ్లను తెలిపారు.**

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని
- ఎన్టిఎ ను వెంటనే రద్దు చేయాలని
- ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని
- విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యు ఐ చేవెళ్ల మండల కమిటీ సభ్యులు ఫాహాద్, అల్తాఫ్, అర్షద్, ఇమ్రాన్, కిరణ్, మనోజ్, ప్రవీణ్ తదితరాలు పాల్గొన్నారు



# లోతట్టు ప్రాంతాల పరిశీలన



- పరిశీలించిన జోనల్ కమిషనర్ రాధిక గుప్త, బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి
- వర్షా ల నేపథ్యంలో వాటర్ లాగింగ్ ప్రాంతాల పరిశీలన

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 9వ డివిజన్ మేడిపల్లి, 10వ డివిజన్ పీర్జాదిగూడ ప్రాంతాల్లో వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాలు వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించేందుకు జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, హైడ్రా ఇన్స్పెక్టర్ మోహన్ తో కలిసి 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి వివిధ ప్రాంతాలను సందర్శించారు. వర్షపు నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరచడం, డ్రైనేజీలను శుభ్రపరచడం, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టడం ద్వారా వాటర్ లాగింగ్ సమస్యను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో డి ఈ సాయినాథ్ గౌడ్, ఏ ఈ సాయి కిరణ్, తిరుపతి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భారత్-జింబాబ్వే టీ20 సిరీస్ షెడ్యూల్.. జట్లు, లైవ్ స్ట్రీమింగ్ వివరాలు ఇవే

భారత్-జింబాబ్వే మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు సమయం ఆసన్నమైంది. జూలై 23 నుంచి హరారే వేదికగా ఈ సిరీస్ ప్రారంభం కానుంది. వరుసగా ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో ఘోర పరాజయాలను చవిచూసిన భారత్.. ఈ సిరీస్‌తో తిరిగి విజయాల బాట పట్టాలని పట్టుదలతో ఉంది. ఇప్పటికే జింబాబ్వే గడ్డపై అడుగుపెట్టిన శ్రేయస్ సేన మూడు రోజుల పాటు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించింది. ఈ సిరీస్ భారత జట్టుతో పాటు వైభవ్ సూర్యవంశీ, మయాంక్ యాదవ్ వంటి యువ ఆటగాళ్లకు ఎంతో కీలకం కానుంది. తన అరంగేట్ర సిరీస్‌లో విఫలమైన వైభవ్.. ఇప్పుడు జింబాబ్వేపై ఎలా రాణిస్తాడోనని అందరూ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఛాన్నాళ్ల తర్వాత జట్టులోకి వచ్చిన యువ పేసర్ మయాంక్ యాదవ్‌పై కూడా అందరి కళ్లు ఉన్నాయి. అంతేకాకుండా ఇంగ్లండ్, ఐర్లాండ్ సిరీస్‌లలో విఫలమైన వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌కు కూడా తన ఫామ్‌ను అందుకోవడానికి ఈ జింబాబ్వే పర్యటన ఎంతగానో ఉపయోగపడనుంది. మరోవైపు సొంతగడ్డపై వరుస విజయాలతో మంచి జోష్ మీద ఉన్న జింబాబ్వే.. టీమిండియాను అడ్డుకునేందుకు తమ అస్త్రశాస్త్రాలను సిద్ధం చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్ షెడ్యూల్, లైవ్ స్ట్రీమింగ్ తదితర విషయాలను తెలుసుకుందాం.



**షెడ్యూల్**

ఈ సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగానే జరగనున్నాయి.

- 1వ టీ20 జూలై 23, 2026 గురువారం సాయంత్రం 4:30 హరారే స్పోర్ట్స్ క్లబ్
- 2వ టీ20 జూలై 25, 2026 శనివారంసాయంత్రం 4:30 హరారే స్పోర్ట్స్ క్లబ్
- 3వ టీ20జూలై 26, 2026 ఆదివారం సాయంత్రం 4:30 హరారే స్పోర్ట్స్ క్లబ్

ఈ మ్యాచ్‌లను భారత్‌లో జీ ఎంటర్‌టైన్‌మెంట్‌కు చెందిన సరికొత్త స్పోర్ట్స్ ఛానెల్ Unite8 Sports లో వీక్షించవచ్చు. అదేవిధంగా ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్‌లో కూడా ఈ మ్యాచ్‌లను చూడవచ్చు.

**జట్లు**

**భారత్**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, ప్రిన్స్ యాదవ్, యష్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రవి బిష్ణోయ్.

**జింబాబ్వే**

సికిందర్ రజా (కెప్టెన్), బ్రియన్ బెన్నెట్, ర్యాన్ బర్ల్, తనకా చివాంగా, బెన్ కుర్రాన్, బ్రాడ్ ఎవాన్స్, వెస్లీ మాధెవెరె, తాడివనాషే మరుమాని, వెల్లింగ్టన్ మసకడ్జా, బ్లెస్సింగ్ ముజరబాని, డియోన్ మైయర్స్, రిచర్డ్ నగరావా, న్యూమాన్ నియామ్‌హురీ, మిల్టన్ షుంబా, తఫద్వా త్సిగా (వికెట్ కీపర్).



# వన్డే వరల్డ్ కప్-2027కు భారత జట్టు ఇదే? భువనేశ్వర్‌కు చోటు?

సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల వేదికగా వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ కోసం ఇప్పటి నుంచే క్రికెట్ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆస్ట్రేలియా బరిలోకి దిగనుండగా.. గత ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టుపై కూడా ఈసారి భారీ అంచనాలు నెలకొన్నాయి .ఈ మెగా టోర్నీ కోసం శుభ్‌మన్ గిల్ సారథ్యంలో బలమైన భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ తయారు చేస్తోంది. సీనియర్ ఆటగాళ్లతో పాటు యువ ఆటగాళ్లపై కూడా సెలక్టర్లు దృష్టి సారించారు. ఇందులో భాగంగా హర్ష్‌దూబే, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్ వంటి యంగ్ ప్లేయర్లను పరీక్షిస్తున్నారు. అంతేకాకుండా యశస్వి జైశ్వాల్‌ను రోహిత్ శర్మకు బ్యాకప్‌గా మేనేజ్‌మెంట్ సిద్ధం చేస్తోంది. వరుసగా విఫలమవుతున్న ఇషాన్ కిషన్ స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ పేరును కూడా సెలక్టర్లు పరిశీలస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వన్డే వరల్డ్‌కప్2027 కోసం పటిష్టమైన భారత ప్లేయింగ్ ఎలెవన్‌ను ఆంధ్ర మాజీ క్రికెటర్ హనుమా విహారి ఎంపిక చేశాడు. గత కొంత కాలంగా జాతీయ జట్టుకు దూరంగా ఉంటున్న వెటరన్ క్రికెటర్లు భువనేశ్వర్ కుమార్, కృనాల్ పాండ్యాకు తను ఎంపిక చేసిన ప్లేయింగ్ ఎలెవన్‌లో విహారి చోటిచ్చాడు. భువీ, కృనాల్ వరుసగా రెండు ఐపీఎల్ టైటిల్స్ గెలిచిన ఆర్సీబీ జట్టులో భాగంగా ఉన్నాడు. ముఖ్యంగా భువనేశ్వర్ కుమార్ అయితే గత రెండు సీజన్లలోనూ అద్భుతంగా రాణించాడు. దీంతో అతడిని తిరిగి భారత జట్టుకు ఎంపిక చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇక విహారి తన జట్టులో ఓపెనర్లగా రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్‌నే కొనసాగించాడు. అదేవిధంగా మూడు, నాలుగు స్థానాల్లో విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ చోటు దక్కించుకున్నారు. ఆల్‌రౌండర్ల కోటాలో అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా, కృనాల్ పాండ్యాలకు అతడు అవకాశమిచ్చాడు. కాగా హార్దిక్ పాండ్యా ప్రస్తుతం వరుస గాయాలతో సతమతమవుతున్నాడు. అతడు భారత వన్డే ప్రపంచ కప్ ప్రణాళికలలో లేనిట్లు వార్తలు వస్తున్నాయి. కానీ బీసీసీఐ నుంచి మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇక బౌలర్ల కోటాలో భువనేశ్వర్ కుమార్‌తో పాటు జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్‌లకు ఛాన్స్ ఇచ్చాడు. సిరాజ్ కూడా ప్రస్తుతం వన్డే జట్టుకు దూరంగా ఉన్నాడు.

**విహారి ఎంపిక చేసిన భారత తుది జట్టు**

శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్

# పాక్ క్రికెటర్లకు పీసీబీ వింత కండీషన్



పాకిస్తాన్ క్రికెటర్లకు ఆ దేశ క్రికెట్ బోర్డు (PCB) వింత కండీషన్ పెట్టింది. లాహోర్‌లోని నేషనల్ క్రికెట్ అకాడమీ (NCA)లో శిక్షణ పొందే ఆటగాళ్ల ఫిట్‌నెస్ మెరుగుపరిచేందుకు 'పాడెల్' ఆటను తప్పనిసరి చేసింది. ప్రతి రెండో రోజు 40 నిమిషాల పాటు ప్రతి ఆటగాడు పాడెల్ గేమ్‌ను ఆడాల్సిందేనని ప్రకటన జారీ చేసింది. పీసీబీ సీనియర్ సెలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ హై పెర్ఫార్మెన్స్ ఆకిబ్ జావెద్ ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఆటగాళ్ల చురుకుదనం, రిఫ్లెక్సులు, కదలికలు, ఫీల్డింగ్ నైపుణ్యాలను మెరుగుపరచడమే ఈ చర్య లక్ష్యమని ఆయన చెప్పారు. ఇప్పటికే పలువురు క్రికెటర్లు పాడెల్ ఆడుతున్నప్పటికీ, అందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆకిబ్ తెలిపారు. ఇప్పుడు ఎన్‌సీఏలోనే ప్రత్యేక పాడెల్ కోర్టును ఏర్పాటు చేయడంతో శిక్షణతో పాటు ఈ ఆటను కూడా ఆడే అవకాశం కల్పించినట్లు చెప్పారు. టెన్నిస్, స్క్వాష్ అంశాల కలయికతో ఆడే పాడెల్ చిన్న కోర్టులో జరిగినప్పటికీ, అధిక స్థాయి ఫిట్‌నెస్, వేగం, స్టామినా అవసరమయ్యే క్రీడగా గుర్తింపు పొందింది. అందుకే దీన్ని క్రికెటర్ల శిక్షణలో భాగం చేశామని ఆకిబ్ వెల్లడించారు. అంతేకాకుండా, భవిష్యత్తులో ఎన్‌సీఏలో బాస్కెట్‌బాల్ కోర్టులు, స్నూకర్‌తో పాటు ఇతర ఇండోర్ గేమ్స్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే అత్యాధునిక ఏఐ (AI) బౌలింగ్ మెషీన్‌ను అకాడమీలో అందుబాటులోకి తీసుకువచ్చామని, ఆటగాళ్ల నైపుణ్యాలను మరింత మెరుగుపరచడమే పీసీబీ లక్ష్యమని ఆకిబ్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, పాకిస్తాన్ జట్టు వచ్చే నెలలో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్తుంది. ఆ పర్యటనలో భాగంగా మూడు టెస్ట్‌లు ఆడనుంది. ఈ సిరీస్ కోసం పాక్ జట్టును ఇది వరకే ప్రకటించారు. ఈ పర్యటనతో కెప్టెన్‌గా బాబర్ ఆజం శకం మళ్లీ మొదలవుతుంది. మాజీ కెప్టెన్ షాన్ మసూద్ వరుస వైఫల్యాల నేపథ్యంలో అతడిని తొలగించి బాబర్‌కు కెప్టెన్సీ పగ్గాలు మళ్లీ కట్టబెట్టారు.

# గత నాలుగు నెలల్లో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నా: వైభవ్ సూర్యవంశీ



ఇటీవల కాలంలో తాను ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొన్నట్లు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తెలిపాడు. జింబాబ్వేతో టీ20 సిరీస్ కోసం సిద్ధమవుతోన్న అతడు బీసీసీఐ టీవీతో మాట్లాడాడు. క్రికెటర్ కెరీర్‌లో ఇవన్నీ సహజమేనని.. వాటన్నింటిని అధిగమించి వందశాతం మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించాడు. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌తో అరంగేట్రం చేసిన వైభవ్ మూడు మ్యాచుల్లోనే ఆడాడు. అతడిని తప్పించడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. మరోవైపు ఇంగ్లాండ్‌పై విఫలమైన వైభవ్.. జింబాబ్వేపై సత్తా చూపించాల్సిన అవసరం ఉంది. ''ఐపీఎల్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టా. ఈ నాలుగు నెలల్లోనే నేను ఒడుదొడుకులను చూశా. క్రికెట్‌లో ఇవన్నీ సహజమేనని తెలుసు. నా సన్నద్ధతను మాత్రం ఆపలేదు. మళ్లీ ఎప్పుడు ఆడే అవకాశం వచ్చినా నా బెస్ట్ ప్రదర్శన ఇస్తా. క్రికెట్‌లో మనం అనుకున్నవన్నీ ఒక్కోసారి జరగకపోవచ్చు. కానీ, అందుకోసం ప్రయత్నించడం మాత్రం ఆపకూడదు. ఒక మ్యాచ్‌కు బెంచ్‌పై కూర్చున్నప్పుడు నిరాశ ఎదురు కావడం సహజమే. కానీ, చుట్టూ ఉండేవారు మద్దతు ఇచ్చినప్పుడు మళ్లీ ఎక్కువగా ప్రాక్టీస్ చేసి సిద్ధం కావాల్సిన అవసరం ఉంది '' అని వైభవ్ తెలిపాడు.

**నా ఫేవరెట్ గ్రౌండ్..**

''హరారే మైదానం (Ind vs Zim) నాకు గుర్తుండిపోతుంది. నాలుగు నెలల కిందటే మేం ఇక్కడ అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ఆడి గెలిచాం. భారీ శతకం చేశా. అందుకే, నాకు ఇది స్పెషల్ గ్రౌండ్. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమనేది ఎప్పటికీ మధురమైన క్షణమే. మళ్లీ ఇక్కడికి రావడం ఆనందంగా ఉంది. నాకు ఇక్కడి పిచ్, వాతావరణంపై అవగాహన ఉంది. అవకాశం వస్తే తప్పకుండా మెరుగైన ఇన్నింగ్స్ ఆడతా. ఇక్కడి మైదానంలో మంచి రికార్డు ఉంది'' అని వైభవ్ వెల్లడించాడు.



# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో.. డేవిడ్ వార్నర్ దోషే

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ తన తప్పును అంగీకరించాడు. గత ఏప్రిల్‌లో మద్యం తాగి వాహనం నడిపిన కేసులో సిడ్నీ పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చాడు. తాజాగా ఆ కేసును సిడ్నీ న్యాయస్థానం విచారించింది. నేరాన్ని వార్నర్ అంగీకరించినట్లు అతడి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. బిగ్ బాష్ లీగ్‌లో సిడ్నీ థండర్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న వార్నర్ కోర్టుకు నేరుగా హాజరు కాలేదు. వాదనలు విన్న న్యాయస్థానం అతడిని దోషిగా తేలుస్తూ వచ్చే నెల 18న శిక్ష ఖరారు చేయనుంది.

**ఇదీ జరిగింది..**

రోడ్డుపై బ్రీత్ టెస్టింగ్‌ను చూడగానే వార్నర్ తన వాహనాన్ని ఆపి పక్కనే పార్క్ చేశాడు. అనుమానం వచ్చిన అధికారులు బ్రీత్ అనలైజర్‌తో టెస్ట్ చేశారు. ఇందులో వార్నర్ పరిమితికి మించి మద్యం సేవించినట్లు తేలడంతో అరెస్టు చేశారు.

# ఢిల్లీలో నిరసనలు: సంజనా గణేషన్ ఇలా.. దేవిశా అలా.. పోస్ట్ వైరల్

ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమంపై టీమిండియా స్టార్లు ఇంతవరకు స్పందించలేదు. అయితే, భారత టీ20 జట్టు మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సతీమణి దేవిశా శెట్టి, టీమిండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా భార్య సంజనా గణేషన్ మాత్రం సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలు పంచుకున్నారు. దేవిశా, సంజనా వైఖరి పట్ల నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. కాగా నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ (CJP) ఆందోళనలు మరింత ఉధృతం చేసిన సంగతి తెలిసిందే. ఫలితంగా ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేపట్టిన 'చలో సంసద్' ర్యాలీ హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





**సంజన ఇలా...**


ఈ నేపథ్యంలో సంజనా గణేషన్ స్పందిస్తూ.. ''నిరసనకు దూరంగా ఉన్న ఆరేళ్ల పసి ప్రాణానికి టియర్ గ్యాస్ వల్ల ఇబ్బంది కలిగినప్పుడు.. ఎవరికైనా సరే ఇది ఇబ్బందిని కలిగిస్తుంది కదా!.. చిన్నారులు టియర్ గ్యాస్ బారిన పడటాన్ని ప్రజాస్వామ్యంలో సాధారణ విషయంగా మార్చకండి. తమను రక్షించడం కోసమని రక్షణ పేరుతో భయపెట్టడాన్ని ఏ పౌరుడు కూడా కోరుకోడు'' అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. సంజనకు పలువురు నెటిజన్లు మద్దతుగా నిలుస్తూ పోలీసుల వైఖరిని ప్రశ్నిస్తున్నారు.

**పోరాటాలు చేయండి అంటూనే...**

ఇక దేవిశా శెట్టి మాత్రం మరింత తీవ్రంగా, కాస్త భిన్నంగా స్పందించింది. ''ఇది స్పాన్సర్ చేసిందే అనుకోండి. రాజకీయ ఉద్దేశాలు ఉన్న పోస్టు అనుకోండి. మీరు దీనికి ఏ పేరు పెట్టినా నిజం మాత్రం మారదు. భారతీయ యువత అగ్నిపంథాను ఎంచుకుంది. సవాళ్లకు ఎదురు నిల్చుంది. పోలీసులు ఈ సమయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. పరిస్థితులను చక్కదిద్దాలి. ప్రభుత్వం కూడా వారి సమస్యకు గల కారణం ఏమిటో తెలుసుకునేందుకు సిద్ధంగా ఉండాలి. ప్రభుత్వాన్ని విమర్శించండి. ప్రధానిని ప్రశ్నించండి. రాజకీయాలకు వ్యతిరేకంగా గళమెత్తండి. అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉద్యమాలు నడపండి. ఓటుతో సమాధానం చెప్పండి. దానినే ప్రజాస్వామ్యం అంటారు. పబ్లిక్ ప్రాపర్టీ అంటే ప్రభుత్వ ఆస్తులు కావు.

**ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేస్తారా?**

మీరు ధ్వంసం చేసిన ప్రతీ బస్సు, విరగొట్టిన ప్రతీ బారికేడ్, తగలబెట్టిన ప్రతీ వాహనం, మీరు నాశనం చేసిన రోడ్డు.. ఇలా ప్రతీదీ భారత పన్ను చెల్లింపుదారుల నుంచి వచ్చిన డబ్బు ద్వారా నిర్మితమైనవి. ఇందులో మీరు కూడా ఉంటారు. ఏదేమైనా హింస అనేది ఎప్పుడూ ప్రజాస్వామ్యం అనిపించుకోదు. మీరు రాళ్లు విసిరినపుడు, పోలీసులపై దాడి చేసినపుడు.. బారికేడ్లను తోసుకుని వెళ్తూ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ ఉంటే దీనిని ఎవరూ నిరసన అనరు. మీరు చట్టాన్ని అతిక్రమిస్తున్నారు'' అని పేర్కొంది. ఈ నేపథ్యంలో పలువురు నెటిజన్లు దేవిశాను విమర్శిస్తున్నారు.




**ఆస్తుల కంటే ప్రాణాలు విలువైనవి కాదా?**


'ఓవైపు విద్యార్థులు ప్రాణాలకు తెగించి న్యాయం కోసం పోరాడుతుంటే.. మీరేమో మీ భర్తను తిరిగి టీమిండియాలోకి చేర్చాలనే ఉద్దేశంతో రాజ్యానికి వంతపాడుతున్నారు. మీరన్నది నిజమే. ప్రభుత్వ ఆస్తుల్ని నష్టపరిచే హక్కు ఎవరికీ లేదు. మరి ఆస్తుల కంటే ప్రాణాలు మరింత విలువైనవి కదా! పేపర్ లీకేజీ వ్యవహారంతో బలవన్మరణాలకు పాల్పడిన విద్యార్థులకు మద్దతుగా మీరు ఏనాడైనా రాజ్యాన్ని ప్రశ్నించారా? ఇప్పుడు మాత్రం ప్రజాస్వామ్యం గురించి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. మన వరకూ వస్తేనే ఏదైనా అర్థమవుతుంది' అని విరుచుకుపడుతున్నారు. మరికొందరేమో దేవిశా సరిగ్గా చెప్పిందంటూ సమర్థిస్తున్నారు.

# రెండు గిన్నిస్ రికార్డులు సాధించిన జపాన్ రైడర్!

జపాన్ కు సంబంధించిన సైక్లిస్టు టొమోమి నిషికుబో అరుదైన విన్యాసంతో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఒలంపిక్ స్కీ జంప్ పై సైకిల్ తో అద్భుతమైన స్టంట్ చేసి రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్నాడు. ముందు చక్రంపై బ్యాలెన్స్ చేస్తూ రివర్స్ లో సైకిలింగ్ చేశాడు. దాదాపు 136.6 మీటర్లు సైకిల్ తొక్కి సరికొత్త రికార్డు క్రియేట్ చేశాడు. 37.5 డిగ్రీల నిటారైన వాలుపై గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఈ సాహసానికి తెర లేపాడు. ఈ క్రమంలోనే ముందు ఉన్న వీల్ బ్యాలెన్స్ చేస్తూ రివర్స్ లో ప్రయాణించిన తొలి వ్యక్తిగా హిస్టరీ క్రియేట్ చేశాడు టొమోమి నిషికుబో. జపాన్ లోని హకుబా స్కీ జంప్ వేదికగా జరిగిన ఈ విన్యాసం ఇప్పుడు వైరల్ గా మారింది. దీనిపై క్రీడా ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# నేను ఆరోగ్యంగా ఉన్నా: అమితాబ్ బచ్చన్



'శస్త్రచికిత్స అనంతరం కోలుకోవడం కష్టం..' అంటూ బాలీవుడ్ అగ్రకథానాయకుడు అమితాబ్ బచ్చన్ పెట్టిన పోస్ట్ చూసి అభిమానులు తీవ్ర ఆందోళనకు గురైన విషయం తెలిసిందే. తాజాగా బిగ్ బీ ఆ పోస్ట్‌కు వివరణ ఇచ్చారు. తనకు ఎలాంటి శస్త్రచికిత్స జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన అర్జెంటీనాస్పెయిన్ ఫిఫా మ్యాచ్‌ను ఉద్దేశించి ఆ పోస్ట్ చేసినట్లు తెలిపారు. ఐసీయూ గురించి తాను చేసిన కామెంట్స్‌ను జనాలు తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు. ''నాకు ఏ సర్జరీ జరగలేదు. ఆరోగ్యంగా ఉన్నాను. నా పోస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారు. శస్త్రచికిత్స తర్వాత ఐసీయూ నుంచి ఇంటికి వచ్చినప్పుడు ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులను ఒక ఉదాహరణగా మాత్రమే చెప్పాను. ఛాంపియన్ ఓడిపోయినప్పుడు, ఆ ఓటమిని తట్టుకుని తిరిగి పుంజుకోవడం ఎంత కష్టమో వివరించడమే నా ఉద్దేశం. ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్స్‌లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా ఓటమిని, మెస్సి పరిస్థితిని మనసులో ఊహించుకొని నేను ఆ పోస్ట్ రాశాను. కానీ, ప్రజలు అది నా ఆరోగ్యం గురించే అనుకున్నారు'' అని వివరణ ఇచ్చారు. దీంతో ఆయన ఫ్యాన్స్ ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం తాను ఎంతో ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపిన అమితాబ్ త్వరలోనే తాను 'కల్కి' సీక్వెల్ షూటింగ్‌లోనూ పాల్గొననున్నట్లు చెప్పారు. మంగళవారం అమితాబ్ తన ఎక్స్, బ్లాగ్‌లో శస్త్రచికిత్స గురించి పోస్ట్ పెట్టారు. ఆసుపత్రి నుంచి ఇంటికొచ్చాక కోలుకునే ప్రక్రియ అత్యంత కష్టమైందని అందులో పేర్కొన్నారు. దీంతో అందరూ ఆయనకు సర్జరీ జరిగిందని భావించారు. తాజా వివరణతో ఆ ఊహాగానాలకు చెక్ పడింది.

# కామన్‌వెల్త్ గేమ్స్‌లో రష్మిక..!



ప్రతిష్టాత్మక కామన్వెల్త్ గేమ్స్‌లో నేషనల్ క్రష్ మెరవనుందా? ఈ క్రీడల సంగ్రామం ముగింపు వేడుకలకు హాజరు కానుందా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ ముద్దుగుమ్మ కామన్‌వెల్త్ గేమ్స్‌లో పాల్గొగనుందని తెలుస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు శంకర్ మహదేవన్‌తో కలిసి ఈ వేడుకకు హాజరకానున్నట్లు సమాచారం. వచ్చే నెల ఆగస్టు 2న జరగనున్న ఈ వేడుకల్లో భారతదేశం తరఫున నిర్వహించే ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొగనుంది. ఈ వేడుకలో రష్మిక ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ వేడుకలకు హాజరయ్యే అవకాశముందని తెలుస్తోంది. ఈ వేడుకల్లో భాగంగా కామన్‌వెల్త్ గేమ్స్ అధికారిక ఫ్లాగ్‌ను భారత్‌కు అందించనున్నారు. 2030లో జరగబోయే 100 ఏళ్ల శతాబ్ది కామన్వెల్త్ గేమ్స్‌కు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరం అతిథ్యం ఇవ్వనుంది. గతంలో 2010లో ఢిల్లీలో కామన్ వెల్త్ గేమ్స్ నిర్వహించిన తర్వాత.. భారత్ ఈ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడం రెండోసారి కావడం విశేషం.


# నందమూరి బాలకృష్ణ ఆరోగ్యంపై డాక్లర్ల కీలక ప్రకటన



నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబోలో రాబోతున్న ప్రతిష్టాత్మక 'NBK111' చిత్రం షూటింగ్ కాకినాడ పోర్ట్ ఏరియాలో జరుగుతుండగా, అనుకోకుండా జరిగిన ఒక ప్రమాదంలో బాలయ్య గాయపడ్డారు. ఈ షూటింగ్‌లో బాలయ్య మోకాలికి గాయమైందని, దానికి ఒక చిన్న సర్జరీ చేయించుకోవాల్సి ఉందని దర్శకుడు గోపీచంద్ మలినేని సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన వెంటనే ఆయనకు స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం తదుపరి వైద్యం, సర్జరీ కోసం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ఇక ఈ విషయం తెలుసుకున్న నందమూరి అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో.. తాజాగా, బాలకృష్ణ ఆరోగ్యంపై ఏఐజీ ఆసుపత్రి డాక్టర్లు ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. ఆయనను పరీక్షించాక ఎడమ మోకాలి దగ్గర రక్తం గడ్డకట్టి, వాపు వచ్చిందని వెల్లడించారు. మోకాలి కండరం ఏమైనా చిరిగిందేమో అని అనుమానిస్తున్నట్లు.. ప్రస్తుతం ఆర్థోపెడిక్ డాక్టర్లు ఆయనను దగ్గరుండి చూసుకుంటున్నారని అన్నారు. అంతేకాకుండా రకరకాల మెడికల్ టెస్టులు కూడా చేస్తున్నారని తెలిపారు. బాలకృష్ణ పాత హెల్త్ రికార్డులను కూడా చూసి, ఆయనకు ఏ ఇబ్బంది లేకుండా సురక్షితమైన వైద్యం అందించడానికి వేర్వేరు విభాగాల డాక్టర్ల టీమ్ ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తోందని అన్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడిందని, నిలకడగా ఉందని డాక్టర్లు చెప్పారు. అన్ని పరీక్షలు పూర్తయ్యాక ఆపరేషన్ ఎప్పుడు చేయాలి, ఎలాంటి వైద్యం అందించాలనేది నిర్ణయిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఈ వార్త తెలిసిన అభిమానులు బాలయ్య త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు.



# "గబ్బర్ సింగ్" నటుడికి బ్రెయిన్ స్ట్రోక్!



గబ్బర్ సింగ్ సినిమా ద్వారా గుర్తింపు పొందిన టాలీవుడ్ నటుడు రమేష్ తీవ్ర అనారోగ్యానికి గురైయ్యాడు. టాలీవుడ్ కు చెందిన చాలా సినిమాల్లో కనిపించిన ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. ఈ నేపథ్యంలో వెంటనే హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రికి రమేష్ ను తరలించారు కుటుంబ సభ్యులు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. రమేష్ పరిస్థితి అత్యంత విషమంగా ఉందని.. స్పెషల్ ట్రీట్మెంట్ అందిస్తున్నట్లు అపోలో వైద్యులు కూడా వెల్లడించారు. దీంతో ఈ న్యూస్ టాలీవుడ్ ఇండస్ట్రీలో కలకలం రేపుతోంది. రమేష్ త్వరగా కోలుకోవాలని, ఎప్పటిలాగే తిరిగి రావాలని ఆయన ఫ్యాన్స్, పవన్ కళ్యాణ్ అభిమానులు ప్రార్థిస్తున్నారు.

# కళ్యాణి ప్రియదర్శన్ జోరు.. ఒకేసారి

## రెండు భారీ ప్రాజెక్ట్స్ చేస్తున్న యంగ్ బ్యూటీ!

తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి మెప్పించిన యంగ్ హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్. గతేడాది ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'లోకా: చాప్టర్ 1' చిత్రం ఏ స్థాయి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మలయాళ సినీ పరిశ్రమలోనే అత్యధిక వసూళ్లు సాధించిన హీరోయిన్‌గా రికార్డు సృష్టించడంతో ఆమె క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ప్రస్తుతం వరుస ఆఫర్లతో ఫుల్ బిజీగా ఉన్న కళ్యాణి, త్వరలోనే 'లోకా: చాప్టర్ 2' షూటింగ్‌లో పాల్గొనడమే కాకుండా బాలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్, జై మెహతా కాంబోలో రాబోతున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ప్రళయ్'లో కళ్యాణి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు పుకార్లు షికారు చేస్తున్న విషయం తెలిసిందే. కానీ దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో అభిమానులు అయోమయంలో పడిపోయారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఆగస్ట్‌లో ప్రారంభం కాబోతుందట. సుమారు రూ. 300 కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ జాంబీ ప్రపంచంలో, కళ్యాణి కేవలం రొమాంటిక్ సీన్లకే పరిమితం కాకుండా హాలీవుడ్ రేంజ్‌లో భారీ ఫైట్లు చేయబోతున్నట్లు టాక్. ఈ సాహసోపేతమైన స్టంట్స్ కోసం విదేశీ యాక్షన్ కోచ్‌ల దగ్గర ఆమె ప్రత్యేక శిక్షణ కూడా పొందుతోందట. హీరో రణ్‌వీర్ సింగ్ దీపావళి నాటికి మొదటి షెడ్యూల్ పూర్తి చేసి, తన బిడ్డ జననం సందర్భంగా కొన్ని రోజులు లీవ్ తీసుకోనున్నారట. ఆ తర్వాత ఈ సినిమా రెండో షెడ్యూల్‌ను 2027లో ప్రారంభించేలా మేకర్స్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.



# హీరోయిన్ కత్రినా కైఫ్‌ని ఎందుకు టార్గెట్ చేశారు?

ఢిల్లీలో సీజేపీ ఆధ్వర్యంలో గత కొన్నిరోజుల నుంచి విద్యార్థి నిరసనలు జరుగుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీక్ విషయమై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని వీళ్లు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు విద్యార్థులే పోరాడుతుండగా తాజాగా ప్రతిపక్షాలు కూడా వీళ్లతో కలిసి చేరాయి. ఈ విద్యార్థి ఉద్యమానికి బాలీవుడ్ నటీనటులు షబానా ఆజ్మీ, ప్రీతి జింటా, రితేష్ దేశ్ ముఖ్, సోనూసూద్, సోనాక్షి సిన్హా తదితరులు తమ సంఘీభావం తెలిపారు. అయితే దీనికి ఏ మాత్రం సంబంధం లేని కత్రినా కైఫ్ మీద ఇప్పుడు పలువురు విమర్శలు చేస్తున్నారు. కత్రినా కైఫ్ అభిమాని ఒకరు 'కేథలిక్ ఫ్యాన్స్' అని ఓ ఫ్యాన్ పేజీ రన్ చేస్తున్నాడు. దీనికి దాదాపు 70 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఇప్పుడు ఈ పేజీ కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు సదరు పేజీ అడ్మిన్ ప్రకటించాడు. చిన్నప్పటి నుంచి కత్రినాకు అభిమానినని, అలాంటిది భారతీయ విద్యార్థులకు సంబంధించిన కీలక అంశంపై ఆమె స్పందించకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందని సదరు అడ్మిన్ వెల్లడించాడు. మేము మీకు కష్టకాలంలో అండగా నిలిచాం. కానీ భారతీయుల కోసం ముఖ్యంగా విద్యార్థుల కోసం ఒక్క మాట కూడా మీరు మాట్లాడలేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం మీకు లేదు. అందుకే మిమ్మల్ని అన్‌ఫాలో చేస్తున్నా. ఈ ఫ్యాన్‌పేజీని కూడా మూసివేస్తున్నా అని సదరు అడ్మిన్ పేర్కొన్నాడు. ఈ విషయమై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు సదరు పేజీ అడ్మిన్‌కి సపోర్ట్ చేస్తుండగా మరికొందరు మాత్రం కత్రినాకు మద్దతిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ఉన్నట్లే, స్పందించకపోయే హక్కు కూడా ఉంటుందని గుర్తుచేస్తున్నారు. ప్రతి సామాజిక, రాజకీయ అంశంపై సెలబ్రిటీలు తప్పనిసరిగా స్పందించాల్సిన అవసరం లేదని వారు చెబుతున్నారు.

# చాలా సినిమాలకు కావాలనే తప్పించారు



బాలీవుడ్ బ్యూటీ ప్రియాంకా చోప్రా చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత ఇండియన్ మూవీలో నటిస్తోంది. మహేశ్ బాబురాజమౌళి కాంబోలో వస్తోన్న అడ్వెంచరస్ మూవీ వారణాసిలో హీరోయిన్‌గా కనిపించనుంది. బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ.. పలువురు స్టార్ హీరోల సరసన మెప్పించింది. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌కు హాజరైన ముద్దుగుమ్మ తన కెరీర్‌కు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. కేవలం ఒక్క క్షణంలోనే సినిమా చేజారిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. కొంత మందిని మెప్పించలేకపోయాననే కారణంతో తనను సినిమా నుంచి తొలగించిన సందర్భాలు చాలా ఉన్నాయని ప్రియాంక తెలిపింది. ప్రియాంక చోప్రా మాట్లాడుతూ..'నేను వాళ్లతో ఏకీభవించలేదని.. నన్ను సినిమాల నుంచి తీసేశారు. 2007లో ఓ సినిమాకు నన్ను ఎంపిక చేశారు. సలామ్‌ఎఇష్క్ షూటింగ్ సమయంలో మరో సినిమాలో నటించాల్సి ఉంది. ఆ సమయంలో హీరో ఒకరోజు నా సెట్‌కు వచ్చారు. తర్వాత నెలలోనే షూటింగ్ ప్రారంభం కానుందని తెలిసి నాకు మద్దతుగా వచ్చాడని అనుకున్నా. కానీ ఆయన ఊహించని మాట చెప్పారు. దర్శకుడు పొరపాటున నిన్ను సెలెక్ట్ చేశారు. నిజానికి ఈ రోల్ మరో హీరోయిన్ చేయాల్సింది. మనం భవిష్యత్తులో మరో సినిమా చేద్దాం. ఈ విషయం నీకు చెప్పాలనే వచ్చా' అని చెప్పారని గుర్తు చేసుకుంది. అంతేకాకుండా కొందరు అగ్ర హీరోలు నన్ను ఉద్దేశపూర్వకంగా సినిమాల నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేసింది.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com